



తిరువూరు మున్సిపల్ కార్యాలయం వద్ద టీడీపీ, వైసీపీ నేతల మోహరింపు

‘పనులు దక్కడానికి టెండర్ ఎంత తక్కువైనా వేద్దాం. టెండర్ దక్కాక ఏదోలా పని కానిచేద్దాం. తర్వాత బిల్లులు పూర్తిస్థాయిలో తీసుకుందాం.’ ఇదీ జలవనరుల శాఖలో కాంట్రాక్టర్ల ఆలోచనాతీరు. టెండర్లలో పోటీపడి తక్కువగా కోట్ చేశాక పనులు తమకు నచ్చినట్టుగా చేస్తున్నారు. ఆయా కాల్వల వద్ద పరిస్థితి చూస్తుంటే అసలు ఇక్కడ పనులు జరిగాయా.. అనే అనుమానం కలుగుతోంది. కాల్వల వద్ద మళ్లీ మొలకెత్తుతున్న కిక్కిసే ఇందుకు నిదర్శనం.

ఉంగుటూరు మండలం ఆత్కూరు యూటీ డ్రెయిన్ వద్ద తొలగించినా మళ్లీ మొలకెత్తిన కిక్కిస



‘కిక్కిస’లో నొక్కిసలాట!

జిల్లాలోని కాల్వల్లో నామమాత్రంగా కిక్కిస తొలగింపు పనులు

- జనవరిలో టెండర్లు, మార్చిలో పనులు పూర్తి
- జూన్‌లో నీటి విడుదల.. ఈలోపే పెరిగిన కిక్కిస
- మూడు ప్రధాన కాల్వల్లోనూ ఇదే పరిస్థితి
- కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం.. బిల్లులకు మాత్రం సిద్ధం
- ముడుపుల మాయలో జలవనరుల శాఖ ఇంజనీర్లు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో బందరు, ఏలూరు, రైవస్, బుడమేరు కాల్వలు ప్రవహిస్తాయి. విజయవాడ నుంచి దిగువకు వెళ్లేకొద్దీ ఈ కాల్వల్లో ఒకప్పుడు తూటికాడ, గుర్రపుడెక్క ఎక్కువగా కనిపించేది. కొన్నేళ్లుగా కిక్కిస మొలకెత్తడం మొదలైంది. త్వరలో కాల్వలకు నీరు వదలనుండటంతో కిక్కిస తొలగింపు పనులకు జలవనరుల శాఖ టెండర్లు పిలిచింది. ఈ టెండర్లను దక్కించుకున్న కాంట్రాక్టర్లు తూతూమంత్రంగా పనులు చేసి చేతులు దులిపేసుకున్నారు. దీంతో కాల్వల వద్ద పాత పరిస్థితే కనిపిస్తోంది.

తూతూమంత్రంగా పనులు..

అయినా బిల్లులకు రెడీ

ఉమ్మడి కృష్ణాజిల్లాలో మూడు ప్రధాన కాల్వల ద్వారా తాగు, సాగునీరు సరఫరా అవుతోంది. బందరు, రైవస్, ఏలూరు కాల్వలు జిల్లాలోని తాగు, సాగునీటి అవసరాలను తీరుస్తున్నాయి. వీటికి అనుబంధంగా సుమారు 200 వరకు ఉపకాల్వలు ఉన్నాయి. ఒక్కో ప్రధాన కాల్వకు పది వరకు ఉపకాల్వలు ఉంటాయి. వాటికి అనుబంధంగా పిల్ల కాల్వలు ఉంటాయి. తూర్పుడెల్టా పరిధిలో ఆయకట్టు సాగుకు మొత్తం ఈ కాల్వల ద్వారానే నీరు అందుతోంది. వీటిలో అల్లుకుపోయిన కిక్కిసను తొలగించడానికి జలవనరుల శాఖ అధికారులు జనవరిలో టెండర్లు ఆహ్వానించారు. మొత్తం రూ.25.49 లక్షల పనులకు టెండర్లు పిలిచారు. ఈ టెండర్లను 38.89 శాతం తక్కువకు వేసి కాంట్రాక్టర్లు పనులు దక్కించుకున్నారు. హడావిడిగా మార్చి నెలాఖరుకు పనులు పూర్తిచేశారు. వాస్తవానికి కిక్కిసను వేళ్లతో సహా తొలగించాలి. అటువంటిది కాంట్రాక్టర్లు ఎక్స్‌కవేటర్లతో పైపైనే తొలగించారు. దీంతో కాల్వల వద్ద మళ్లీ కిక్కిస మొలకెత్తుతోంది. అసలు పనులు ఏ స్థాయిలో, ఏవిధంగా జరిగాయో పరిశీలించాల్సిన ఇంజనీర్లు ముడుపుల మత్తులో జోగుతున్నారు. పనులు జరిగిన వైపు ఇప్పటి వరకు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. కానీ, పనులు పూర్తి చేశామని చెబుతూ కాంట్రాక్టర్లు బిల్లులు తీసుకోవడానికి సిద్ధమవుతున్నారు.

ముడుపుల మత్తులో ఇంజనీర్లు

కాల్వలో తూటికాడ, గుర్రపుడెక్క ఉన్నా నీరు ఎంతో కొంత నెమ్మదిగా ఉపకాల్వలకు ప్రవహిస్తుంది. అదే కిక్కిస కాల్వలను అల్లుకుందంటే ఇక అంతే సంగతులు. నీటిని కిందకు ప్రవహించకుండా అడ్డుకుంటుంది. వాటిని తొలగించడానికి కూలీలూ కిందకు దిగలేని పరిస్థితి ఉంటుంది. కృష్ణాడెల్టా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ కిక్కిస పేరు వినిపించలేదు. ఇది ఎక్కువగా కొల్లేరు ప్రాంతంలో ఉండేది. నెమ్మదిగా కృష్ణాడెల్టాలోని కాల్వలోకి ప్రవేశించింది. ఐనంపూడి డ్రెయిన్, ఏనుగులకోడు, నందివాడ మండలంలోని ఆత్కూరు యూటీ (అండర్ టన్నల్), ఉంగుటూరు మండలంలోని వన్నేరు మీదుగా ప్రవహిస్తున్న కాల్వల్లో కిక్కిరిసి అల్లుకుపోయింది. గట్ల నుంచి కాల్వల వరకు విస్తరిస్తోంది. జూన్‌లో జలవనరుల శాఖ అధికారులు కాల్వలకు నీటిని విడుదల చేసినా పూర్తిగా కిందకు వెళ్లలేని పరిస్థితి కనిపిస్తోంది.

తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక

నేటికి వాయిదా

- కోరం లేకపోవడంతో ఎన్నికల అధికారి నిర్ణయం
- మున్సిపల్ కార్యాలయం వద్ద టీడీపీ, వైసీపీ ఘర్షణ
- తమను కార్యాలయంలోకి రానివ్వలేదని వైసీపీ నిరసన
- తమ వారిని నిర్బంధించారని టీడీపీ ఆరోపణ
- ఇరువర్గాల బాహాబాహీ.. చెదరగొట్టిన పోలీసులు

తిరువూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : తీవ్ర ఉద్రిక్తతల నడుమ తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక వాయిదా పడింది. సరిపడా సభ్యులు (కోరం) లేకపోవడంతో చైర్‌పర్సన్ ఎన్నికను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారిణి, ఆర్డీవో కె.మాధురి ప్రకటించారు. ఈ ఎన్నికకు సోమవారమే అన్ని ఏర్పాట్లు చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తొలుత టీడీపీ కౌన్సిలర్లను పోలీసులు నిలిపివేయడంతో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కలగజేసుకుని, బారికేడ్లను పక్కకు తీసి తమ సభ్యుల్ని లోపలకు పంపించారు. ఆ తర్వాత ప్రత్యేక వాహనంలో వచ్చిన వైసీపీ సభ్యులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కొందరిని మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. వారంతా బారికేడ్లను తొలగించుకుని ముందుకొచ్చేందుకు ప్రయత్నించగా, ఎమ్మెల్యే, టీడీపీ శ్రేణులు.. వైసీపీకి చెందిన ఇతరులను అడ్డుకున్నారు. అయితే, అధికార పార్టీ నాయకులు తమను లోపలకు వెళ్లనీయడం లేదని వైసీపీ కౌన్సిలర్లు రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. కార్యాలయం వద్ద అరుపులు, తోపులాటతో అంతా గందరగోళం ఏర్పడింది. ఇటీవల తమ పార్టీలో చేరిన కొందరు సభ్యుల్ని వైసీపీ నాయకులు అక్రమంగా నిర్బంధించారని టీడీపీ శ్రేణులు ఆరోపించాయి. కాగా, సోమవారం ఉదయం 11 నుంచి 12 గంటల్లోపు చైర్‌పర్సన్ ఎన్నిక జరగాల్సి ఉండగా, సమావేశ మందిరంలోకి కేవలం ఏడుగురు సభ్యులే హాజరుకావడంతో ఎన్నిక సమయం పూర్తై, మంగళవారానికి వాయిదా వేశారు. వాయిదా ప్రకటన రాగానే, వైసీపీ కౌన్సిలర్లు ప్రత్యేక వాహనంలో వెళ్లిపోయారు.

ఇరువర్గాల మోహరింపు

సోమవారం ఉదయం నుంచే టీడీపీ, వైసీపీ శ్రేణులు మున్సిపల్ కార్యాలయం వద్ద మోహరించాయి. ఓవైపు ఎమ్మెల్యే కొలికపూడితో పాటు టీడీపీ కౌన్సిలర్లు కార్యాలయానికి భారీగా చేరుకోగా, మరోవైపు వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాశ్ ఆధ్వర్యంలో వైసీపీ కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. విజయవాడ, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వైసీపీ నాయకులు.. టీడీపీ శ్రేణులపై కవ్వింపు చర్యలకు పాల్పడటంతో వివాదం చెలరేగింది. దీంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ప్రశాంత వాతావరణం నెలకొంటున్న సమయంలో బయట నుంచి వచ్చిన కొందరు వ్యక్తులు తిరిగి మున్సిపల్ కార్యాలయం వద్ద గొడవ చేయడానికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వాసం మునియ్య, కొందరు టీడీపీ కార్యకర్తలకు స్వల్పగాయాలయ్యాయి.

ద్వీపానికి ఉక్కు కవచం
8



‘వందే భారత్’ డిపో రెడీ!

- ఇక విజయవాడ కేంద్రంగా నిర్వహణ పనులు
- డిపో, పరిపాలనా భవనం, రైలు ట్రాక్ సిద్ధం
- భారీ మంచినీటి ట్యాంక్ ఏర్పాటు
- ప్రస్తుతం నడుస్తున్న మూడు వందేభారత్‌లు
- రానున్న రోజుల్లో పెరగనున్న రైళ్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): బెజవాడ కేంద్రంగా జరుగుతున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల మెయింటెనెన్స్ డిపో పనులు తుది దశకు చేరుకున్నాయి. మరికొద్ది రోజుల్లోనే డిపో ప్రారంభం కానుంది. విజయవాడ మీదుగా ప్రస్తుతం మూడు వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. సికింద్రాబాద్ - విశాఖపట్నం వయా విజయవాడ, విజయవాడ - చెన్నై, తిరుపతి - విజయవాడ (అవుటర్) మధ్యన మొత్తం మూడు వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. ప్రస్తుతం చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)లో పెద్ద ఎత్తున వందేభారత్ రైళ్లు రూపుదిద్దుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో మరికొన్ని రూట్లలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే అవకాశం ఉంది.

అన్ని వసతులు ఏర్పాటు

దేశంలోనే రెండో అతి పెద్ద రైల్వే జంక్షన్ విజయవాడ కావటంతో ఇక్కడ వందేభారత్ రైళ్లకు మెయింటెనెన్స్ స్టేషన్ అవసరమన్న ఉద్దేశ్యంతో రైల్వేబోర్డు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల మెయింటెనెన్స్ డిపో ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విజయవాడలో మిల్క్ ఫ్యాక్టరీ ఎగువన ఫ్లై ఓవర్‌కు సమీపంలో రైల్వే యార్డుకు దగ్గరగా దీనిని ఏర్పాటు చేశారు. ఇప్పటికే వందేభారత్ రైళ్లకు సరిపడా అతి పెద్ద డిపోను ఏర్పాటు చేశారు. ఈ డిపోలో మెట్రో రైల్ రావటానికి వీలుగా ట్రాక్‌లను సిద్ధం చేశారు. ఈ ట్రాక్స్ వెంబడే మెకానిక్‌లు మిగతా 6లో..



టీడీపీ అవనిగడ్డ నియోజకవర్గ మినీ మహానాడును పురస్కరించుకుని మోపిదేవిలో ఎడ్ల బండిపైకి ఎక్కి పోటీలు ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర
6

ఈ చెవి దిద్దులు తీసుకుని న్యాయం చేయండి

జిల్లా అధికారులకు తరకటూరు మహిళ విజ్ఞప్తి

- నా తల్లిదండ్రుల స్థలం ఆక్రమించి ఇల్లు కట్టారు
- కోర్టుకెళ్తే నాకు అనుకూలంగా తీర్పు వచ్చింది
- అమలు చేయమని రెవెన్యూ, పోలీస్ అధికారులను కోరితే..
- గ్రామపెద్దలతో కలిసి డబ్బులు అడుగుతున్నారు
- నా వద్ద నగదు లేదు.. ఇవి వారికిచ్చి న్యాయం చేయండి
- ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్ద మహిళ ఆవేదన

ఈ చెవి దిద్దులు తీసుకుని అయినా నాకు న్యాయం చేయండి అంటూ గూడూరు మండలం తరకటూరుకు చెందిన ఓ మహిళ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారుల టేబుల్‌పై బంగారు వస్తువులు పెట్టడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. కోర్టు తీర్పు నాకు అనుకూలంగా వచ్చినా.. మండల స్థాయిలో రెవెన్యూ, పోలీస్ అధికారులు, గ్రామపెద్దల తీరుతో విసిగిపోయానని, వారడుగుతున్నంత డబ్బు నా వద్ద లేదని, వీటిని వారికి ఇప్పించి ఆక్రమణలోని నా స్థలం ఇప్పించాలని వేడుకుంది.



చెవి దిద్దులు టేబుల్‌పై పెట్టి అధికారులకు వేడుకుంటున్న తరకటూరుకు చెందిన భార్గవి

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం: గూడూరు మండలం తరకటూరుకు చెందిన భార్గవి అనే మహిళ తల్లిదండ్రులకు గ్రామం ఉన్న నాలుగు సెంట్ల ఇళ్ల స్థలాన్ని కొందరు ఆక్రమించి ఇల్లు నిర్మించుకున్నారు. దీనిపై భార్గవి జిల్లా కోర్టును ఆశ్రయించారు. కోర్టులో తీర్పు భార్గవికి అనుకూలంగా వచ్చింది. అయితే ఆక్రమణదారులు స్థానిక పెద్దల సహకారంతో ఇల్లు ఖాళీ చేయడంలేదు. దీనిపై పోలీస్, రెవెన్యూ అధికారులను కలిసి కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని భార్గవి కోరారు. అయితే స్థానిక పెద్దలు అధికారులపై ఒత్తిడి తెచ్చి కోర్టు తీర్పును అమలు చేయనీయడంలేదు. గట్టిగా అడిగితే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని సమాచారం. ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన భార్గవి అధికారులను కలసి వినతిపత్రం అందించింది. "న్యాయం చేయమంటే అధికారులు, గ్రామపెద్దలు డబ్బులు అడుగుతున్నారు.. తన వద్ద డబ్బు లేదు.. ఈ చెవిదిద్దులే ఉన్నాయి. వీటిని వారికి ఇచ్చి తన తల్లిదండ్రుల ఇంటిస్థలాన్ని తనకు అప్పగించేలా చూడాలి" అని కోరుతూ చెవికున్న దిద్దులను తీసి అధికారుల ఎదుట టేబుల్‌పై పెట్టింది. ఈ పరిణామంతో అధికారులు ఖంగుతిన్నారు. వెంటనే తేరుకుని గతంలోనే గూడూరు మండల అధికారులకు ఈ సమస్యను పరిష్కరించాలని చెప్పామని, మళ్లీ చెబుతామని మచిలీపట్నం ఆర్డీవో సర్దిచెప్పారు.

మానవ హక్కుల సంఘం ముసుగులో మోసం చేసిందని ఎస్పీకి ఫిర్యాదు

మచిలీపట్నంలో మానవ హక్కుల సంఘం చైర్మన్‌నని చెప్పుకుంటున్న రజనీ తనను మోసం చేయడమే కాకుండా, కేసు పెట్టిస్తానని బెదిరిస్తోందని, తనకు న్యాయం చేయాలని పెడనకు చెందిన బట్టా పావని అనే మహిళ జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం అర్జీ అందజేశారు. తన భర్త శివనాగసుబ్బారావు వేరే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని, ఈ వ్యవహారంలో తనకు న్యాయం చేయమని రజనీ వద్దకు వెళ్లానని ఆమె తెలిపింది. తనకు విడాకులు ఇప్పిస్తానని, ఖర్చుల కింద లక్ష రూపాయలు ఇవ్వమని కోరిందని ఫిర్యాదులో మిగతా 6లో..

తప్ప తాగి.. తన్నులాట

ముగ్గురు స్నేహితుల అరాచకం

- విజయవాడలో పలువురిపై దాడి
- అపస్మారకస్థితిలో డెలివరీ బాయ్

విజయవాడ, మే 19(ఆంధ్రజ్యోతి) : ముగ్గురు స్నేహితులు పీకల దాకా తాగారు. కారులో బయటకు వచ్చారు. నడిరోడ్డుపై కనిపించిన వాళ్లందరితో కయ్యానికి కాలు దువ్వారు. ఎదురుతిరిగిన వారిపై దాడి చేశారు. యనమలకుదురుకు చెందిన ముగ్గురు యువకులు ఆదివారం రాత్రి సృష్టించిన వీరంగం ఇది. పెనమలూరు మండలం మిగతా 6లో..



ఆక్రమణ చెరలో అంపాపురం కోడు కాలువ
8

అర్జీల పరిష్కారానికి కృషి : ఇన్‌చార్జి కలెక్టర్

మచిలీపట్నం బస్టాండ్ సెంటర్లో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



ముంచెత్తిన వాన

జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో సోమవారం భారీ వర్షం కురిసింది. ప్రధాన వీధులన్నీ జలమయమయ్యాయి. రేవతీ సెంటర్‌లోని మెయిన్‌రోడ్డు, బస్టాండ్ సెంటర్, పోర్టు రోడ్డు, నాగపోతరావు సెంటర్‌లో మోకాలిలోతు నీరు చేరింది. రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో అక్కడక్కడ ఒక మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. మచిలీపట్నంలో అత్యధికంగా 30.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉంగుటూరులో 13.2, అవనిగడ్డలో 11.8, కోడూరులో 6.4, గూడూరులో 5.8, ఘంటసాలలో 3.4 మిల్లీమీటర్ల వర్షం పడింది. గుడ్లవల్లేరు, పామర్రు, మోపిదేవి, చల్లపల్లిలో ఒక మోస్తరు వర్షం కురిసింది.

-మచిలీపట్నం/మచిలీపట్నం టౌన్, ఆంధ్రజ్యోతి

భక్తులకు మెరుగైన సేవలందించండి

● అధికారులతో సమీక్షలో దుర్గగుడి ఈవో శీనానాయక్



వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న దుర్గగుడి ఈవో శీనా నాయక్

ఇంద్రకీలాద్రి, మే 19(ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులకు మెరుగైన సేవలందించాలని అధికారులకు ఈవో శీనానాయక్ సూచించారు. అమ్మవారి సన్నిధిలో ప్రొటోకాల్ విధానం, ఆర్జిత సేవలు, త్వరగా దర్శనం కల్పించడం, ప్రజారవాణా, తాగునీరు, వివిధ సౌకర్యాల కల్పనపై సోమవారం వివిధ విభాగాల బాధ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇటీవల దేవదాయ శాఖ కార్యదర్శి, కమిషనర్ నిర్వహించిన సమావేశంలో నిర్దేశించిన అంశాలను సిబ్బందికి వివరించారు. భక్తుల సంతృప్తస్థాయి పెంచడం, గౌరవంగా మెలగడం, సాంకేతికతను ఉపయోగించి భక్తులకు మెరుగైన సేవలు అందించడంపై వివిధ విభాగాల నుంచి వివరాలు తెలుసుకుని సమీక్షించారు. ఈఈ కోటేశ్వరరావు, ఏఈఓలు పి.చంద్రశేఖర్, ఎన్.రమేష్‌బాబు, జె.శ్రీనివాసం పాల్గొన్నారు.



సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

యువతకు మార్గదర్శి పుచ్చలపల్లి సుందరయ్య

● వర్ధంతి సందర్భంగా సీపీఎం నేతల ఘన నివాళి

గవర్నర్‌పేట, మే 19(ఆంధ్రజ్యోతి): నిరాశ, నిస్పృహలకు లోనవుతున్న యువతకు ప్రత్యామ్నాయ ఆలోచనలు, స్ఫూర్తినివ్వడంలో మార్క్సిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య మార్గదర్శి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఎంజీ రోడ్డులోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రజానాట్య మండలి కళాకారులు విప్లవగేయాలు ఆలపించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు కె.సుబ్బరావమ్మ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్, నాయకులు కె.ఉమామహేశ్వరరావు, గేయానంద్, ఎస్. అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు సుందరయ్య



బెజవాడ బార్ అసోసియేషన్‌లో మాట్లాడుతున్న తమ్మారెడ్డి భరద్వాజ

విజయవాడ లీగల్: నేటి రాజకీయ నాయకులు పది తరాలకు సంపాదించుకుంటుంటే, పుచ్చలపల్లి సుందరయ్య పది తరాలు బాగుపడాలని రాజకీయాలు చేశారని రాజకీయ నాయకులంతా ఆయనను ఆదర్శంగా తీసుకొని ప్రజాసంక్షేమానికి పాటుపడాలని సినీ దర్శకుడు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ సూచించారు. బెజవాడ బార్ అసోసియేషన్‌లో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమాన్ని న్యాయవాదులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా తమ్మారెడ్డి భరద్వాజ విచ్చేసి, సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కామ్రేడ్ సుందరయ్య జీవితాన్ని విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలూ) జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపర దుర్గా శ్రీనివాసరావు, బెజవాడ బార్ అధ్యక్ష, కార్యదర్శులు ఏకే బాషా, కేవీ రంగారావు పాల్గొన్నారు.



నాగలక్ష్మీ అమ్మవారు, పూజల్లో పాల్గొన్న అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ దంపతులు

కన్నుల పండువగా శాంతి కల్యాణం

కంచికచర్ల, మే 19(ఆంధ్రజ్యోతి): వసంత కాలనీలో మహావిష్ణు సమేత నాగలక్ష్మీదేవి అమ్మవారి శాంతి కల్యాణ మహోత్సవం సోమవారం శాస్త్రోక్తంగా, కన్నుల పండువగా జరిగింది. ఉదయం అమ్మవారిని అభిషేకించి ప్రత్యేకంగా అలంకరించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ నన్నపనేని లక్ష్మీనారాయణ-లక్ష్మి దంపతులతో పాటుగా నాలుగు జంటలు పీటలపై కూర్చొని శ్రీసూక్త సహిత సర్వదైవత్య సారమాత్మిక హోమం నిర్వహించారు. వేద పండితులు అమ్మవారి శాంతి కల్యాణం వైభోపేతంగా నిర్వహించారు. వేలాది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం మేళతాళాలతో మహావిష్ణు సమేత నాగలక్ష్మీదేవికి గ్రామోత్సవం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు కోగంటి బాబు పాల్గొన్నారు.

డాన్‌బాస్కో స్కూల్ ప్రిన్సిపాల్‌పై ఉపాధ్యాయిని యాసిడ్ దాడి

● స్వల్ప గాయాలు..ఆస్పత్రికి తరలింపు



యాసిడ్ దాడిలో గాయపడిన ప్రిన్సిపాల్ విజయ ప్రకాష్

ఇబ్రహీంపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం నుంచి తొలగించారనే అక్కసుతో ప్రిన్సిపాల్‌పై ఓ ఉపాధ్యాయిని పథకం ప్రకారం యాసిడ్ దాడి చేసింది. ఈ ఘటన గుంటుపల్లి డాన్‌బాస్కో స్కూల్లో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఇబ్రహీంపట్నానికి చెందిన ప్రియదర్శిని అనే ఉపాధ్యాయిని గుంటుపల్లి డాన్‌బాస్కో స్కూల్లో ఒకటో తరగతి విద్యార్థులకు బోధన చేస్తుంటుంది. బోధన సమయంలో విద్యార్థులను అకారణంగా దారుణంగా దండిస్తుందని తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు గత నెలలో ఆమెను ప్రిన్సిపాల్ విజయ ప్రకాష్ విధుల నుంచి తప్పించాడు. దీంతో కోపం పెంచుకున్న ఆమె సోమవారం పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపాల్‌తో గొడవ పడింది. తన వెంట తెచ్చుకున్న యాసిడ్‌ను ప్రిన్సిపాల్ ముఖంపై పోసింది. దీంతో ఆయన స్వల్పంగా గాయపడ్డాడు. ప్రిన్సిపాల్‌ను చికిత్స నిమిత్తం విజయవాడలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు ప్రియదర్శినిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. యాసిడ్‌లో పవర్ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని పోలీసులు తెలిపారు.

మహిమాన్విత క్షేత్రం కొండపర్వ గట్టు!





కొండపైకి వెళ్లేందుకు అభివృద్ధి చేసిన రహదారి

ఆహ్లాదకర వాతావరణంలో ఆధ్యాత్మిక శోభతో అలరారుతుతున్న సుందర ప్రాంతం

- కొండపై స్వయంభువుగా వెలసిన మల్లయ్యస్వామి
- భక్తుల కొంగుబంగారం..కోర్కెలు తీర్చే స్వామిగా ప్రతీతి
- శివరాత్రికి అర లక్షకు పైగా భక్తుల రాక
- మౌలిక సదుపాయాలు కల్పించి, కాటేజీలు ఏర్పాటు చేస్తే క్షేత్రానికి మరింత ఆదరణ
- ఎన్టీఆర్ జిల్లాలో పర్యాటకాభివృద్ధికి దోహదపడే క్షేత్రం



కొండపైన మల్లేశ్వరస్వామి ఆలయం

ఎన్టీఆర్ జిల్లాలోని కొండపర్వ గట్టుపైన శైవక్షేత్రంలో శ్రీ భ్రమరాంభికా మల్లేశ్వరస్వామి(మల్లయ్యస్వామి) కొలువై ఉన్నారు. కొండపై కొలువై భక్తుల కొంగుబంగారంగా స్వామి విలసిల్లుతున్నాడని, స్వామిని మొక్కుకుంటే తీరని కోర్కెలు తీరతాయని భక్తులు విశ్వసిస్తుంటారు. పచ్చటి ప్రకృతి అందాలతో ఆహ్లాదకర వాతావరణం పంచే కొండపర్వ గట్టును ఆధ్యాత్మిక క్షేత్రంగానే కాకుండా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి అనేక అవకాశాలున్నాయి. జిల్లా ఆర్థికాభివృద్ధిలో 64 శాతం పర్యాటకం, సేవారంగాల ద్వారా ఆదాయం వస్తున్న నేపథ్యంలో, స్వర్ణాంధ్ర- 2047 కల సాకారం చేసుకునేందుకు జిల్లా యంత్రాంగం, ఏపీటీడీసీ అధికారులు ఆధ్యాత్మిక, పర్యాటకాభివృద్ధికి అవకాశమున్న ఇటువంటి ప్రాంతాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

- (ఆంధ్రజ్యోతి, విస్సన్నపేట)

ఇదీ ఆలయ నేపథ్యం

70 ఏళ్ల క్రితం నూజివీడు, విస్సన్నపేటకు మధ్యలో ఉన్న కొండపర్వలో కొండగట్టుపై శ్రీ భ్రమరాంభికా మల్లేశ్వరస్వామి (మల్లయ్యస్వామి) స్వయంభువుగా వెలసినట్టు ప్రతీతి. కొండగట్టు సమీపంలోని చిత్తపూర్‌కు చెందిన కొందరు మేకల కాపరులు మేకలను మేపుతుండగా మల్లయ్యస్వామి దర్శనమిచ్చారని అప్పటి నుంచి పూజలు చేయడం ప్రారంభించారు. ఏడాది పాటు చిత్తపూర్ గ్రామస్థులు తిరునాళ్ల నిర్వహించారు. రెండో ఏడాది నుంచి కొండపర్వకు చెందిన గొట్టిపూళ్ల ఉమామహేశ్వర వెంకటరామారావు(పెద్దబాబు), గొట్టిపూళ్ల దుర్గా మల్లేశ్వరవరప్రసాద్(చిన్నబాబు) ఆధ్వర్యంలో గ్రామస్థులతో కలిసి స్వామి కల్యాణం నిర్వహించారు. వారి తర్వాత వారి వారసులు దివంగత మాజీ సర్పంచ్ గొట్టిపూళ్ల రామకృష్ణ రంగారావు ఆధ్వర్యంలో గ్రామస్థుల సహకారంతో అంగరంగ వైభవంగా తిరునాళ్ల, బుర్రకథలు, హరికథలు, డ్రామాలు నిర్వహించేవారు. గొట్టిపూళ్ల బుచ్చి వెంకట్రామ లక్ష్మీనరసింహారావు(బుచ్చిబాబు) ఆలయ ట్రస్టీగా ఉన్నారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు మట్టా వేణుగోపాలరావు తన సొంత నిధులు రూ.50 వేలతో భక్తుల సౌకర్యార్థం రహదారిని ఏర్పాటు చేశారు. 2006లో కొండపర్వ అల్లుడు గోవర్ధనగిరి వెంటక బుచ్చిబాబు తన సొంత నిధులతో గట్టుపై ఆలయాన్ని పునర్నిర్మించారు. 2017లో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో ఇరువర్గాల మధ్య గొడవ జరగడంతో పోలీసులు లాఠీచార్జీ చేశారు. అప్పటి నుంచి ప్రతి శివరాత్రికి స్వామి కల్యాణం మాత్రమే నిర్వహిస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరపడం లేదు. ఇటీవల జరిగిన శివరాత్రికి అర లక్షకు పైగా భక్తులు స్వామి దర్శనానికి వచ్చారని గణాంకాలు చెబుతున్నాయి.

ఆహ్లాదం..ఆధ్యాత్మికతల మేళవింపు

కొండ చుట్టుపక్కల మామిడి తోటలు, పొలాలతో ఆహ్లాదకర వాతావరణం, కొండపైన ఆధ్యాత్మిక శోభ మేళవింపుతో కొండపర్వ మల్లయ్యస్వామి మహిమాన్విత క్షేత్రంగా విరాజిల్లుతోంది. ఆలయానికి వచ్చిన భక్తులకు మానసిక ప్రశాంత కలుగుతుంది. గట్టుపై నుంచి చూస్తే విహంగ వీక్షణ చేసినట్లు ఉంటుంది. చుట్టుపక్కల పల్లెలు ఉండటంతో గ్రామాల్లో తిరునాళ్ల మూడు రోజులు ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుంది. ఆలయం వెలసిన కొత్తలో ఒక స్వామి ఉండే వారని నిత్యం స్వామికి పూజలు చేసేవాడని ఆయన ఉన్నట్టుండి మాయమైపోయాడని భక్తులు చెబుతుంటారు. వృద్ధులు కూడా కొండెక్కి మొక్కులు చెల్లించుకుంటుంటారు.



గట్టు కింద స్వామి ఆలయం

పూర్వ వైభవం తెస్తాం



స్వామికి సేవ చేయడం నా పూర్వ జన్మ సుకృతం. స్వామి దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఆలయానికి పూర్వ వైభవం తెస్తాం.

- మట్టా వేణుగోపాల్, ఉత్సవ కమిటీ ఛైర్మన్



2021లో వైసీపీ దౌర్జన్యాలకు నిరసనగా మునిసిపల్ కార్యాలయం వద్ద బైఠాయించిన నల్లగట్ల స్వామిదాసు(ఫైల్)



ఛైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా సోమవారం వైసీపీ కౌన్సిలర్లకు మద్దతుగా ఆందోళన చేస్తున్న జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి

నాటి వైసీపీ తప్పులు..నేడు ఒప్పులయ్యాయా?

● 2021 మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వైసీపీ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందంటూ నలగట్ల స్వామిదాసు నిరసన

● నేడు వైసీపీ కౌన్సిలర్లకు మద్దతుగా ఆయన భార్య, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ సుధారాణి ఆందోళన

తిరువూరు, మే 19(ఆంధ్రజ్యోతి): నాటి వైసీపీ తప్పులు పార్టీ మారగానే ఒప్పులయ్యాయా అంటూ వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, ఆయన భార్య జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సుధారాణి తీరును పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా సోమవారం వైసీపీ కౌన్సిలర్లతో పాటుగా కార్యాలయంలోకి వచ్చేందుకు యత్నించిన బయట వ్యక్తులను పోలీసులు అడ్డుకున్నారు. వైసీపీ కౌన్సిలర్లను కౌన్సిల్ హాల్‌కు వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేస్తున్నారని జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సుధారాణి, అప్పటి మునిసిపల్ ఎన్నికల సందర్భంగా టీడీపీ అభ్యర్థుల్ని బెదిరించి, నామినేషన్లు విత్‌డ్రా చేయించి కౌన్సిలర్‌గా ఎన్నికైనవారు, కొందరు వైసీపీ నాయకులు ఆరోపించారు. వారంతా రోడ్డుపక్కన బైఠాయించారు. అయితే 2021లో వైసీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల్ని నామినేషన్లు వేయనీయకుండా వైసీపీ నాయకులు అడ్డుకున్నారంటూ, నామినేషన్లు విత్‌డ్రా చేయించారంటూ వైసీపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని, అక్రమ మార్గంలో మున్సిపల్ బోర్డును దక్కించుకునేందుకు కుట్రపూరితంగా ప్రవర్తిస్తోందని ఆరోపిస్తూ నాడు టీడీపీ నేత నలగట్ల స్వామిదాసు మున్సిపల్ కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించారు. నాడు వైసీపీ అక్రమాలకు పాల్పడుతోందని ఆందోళన చేసిన స్వామిదాసు..వైసీపీలో చేరగానే ఆ పార్టీ తప్పులు ఒప్పులుగా మారాయా? ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది ఎవరు అని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

చెట్టు కింద ఇబ్రహీంపట్నం తహసీల్దార్ విధులు

● కార్యాలయంలోకి భారీగా చేరిన వర్షపునీరు



ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయంలో చేరిన వర్షపు నీరు



చెట్టు కిందే రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు

ఇబ్రహీంపట్నం/జి.కొండూరు, మే 19(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం, కొండపల్లిలోని పలు పల్లపు ప్రాంతాలు ఆదివారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి జలమయమయ్యాయి. రోడ్లు ఏర్లను తలపించాయి. డ్రెయినేజీలు పొంగి వర్షపు నీరు రోడ్లపైకి చేరింది. ఇబ్రహీంపట్నంలోని తహసీల్దార్ కార్యాలయంలోకి భారీగా వర్షపు నీరు చేరింది. సోమవారం విధులు నిర్వర్తించే వీలు లేకపోవడంతో తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు చెట్టు కిందే విధులు నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట భారీగా వర్షపు నీరు చేరింది. ఉద్యోగులు లోపలికి వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. ఎంఈవో కార్యాలయంలోకి వర్షపు నీరు చేరింది. ఈకార్యాలయాలన్నీ పల్లపు ప్రాంతంలో ఉండటంతో జలమయమయ్యాయి. జి.కొండూరు మండలం కోడూరులో శిథిలావస్థలో ఉన్న మూతపడిన గ్రంథాలయం శ్లాబు వర్షానికి బాగా నానిపడిపోయింది.

ఉపాధి పథకంలో ఇద్దరు ఉద్యోగుల తొలగింపు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

మచిలీపట్నం, మే 19(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో పలు అక్రమాలకు పాల్పడిన ఇద్దరు ఉద్యోగులను శాశ్వతంగా విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు డ్వామా పీడీ శివప్రసాద్‌యాదవ్ సోమవారం తెలిపారు. ఉపాధిలో అవినీతిపై చర్యలేవీ అనే శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు అక్రమాలకు పాల్పడిన ఉద్యోగులపై చర్యలు తీసుకున్నారు. మచిలీపట్నం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనులకు సంబంధించి టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పలు అక్రమాలకు పాల్పడిన కె.రామాంజనేయులుపై వచ్చిన ఫిర్యాదుల మేరకు అధికారులు విచారణ చేసి నివేదికను సమర్పించారని డ్వామా పీడీ తెలిపారు. ఎస్ఎన్ గొల్లపాలెంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.సురేష్ ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు పాల్పడినట్లు అధికారుల విచారణలో వెల్లడైందన్నారు. ఉద్యోగులను సంజాయిషీ కోరి, వ్యక్తిగత విచారణ జరిపి, వారి సంజాయిషీ ఆమోదయోగ్యంగా లేకపోవడంతో ఉద్యోగం నుంచి తొలగించినట్లు ఆయన తెలిపారు.

తప్ప తాగి.. తన్నులాట

(5వ పేజీ తరువాయి)

యనమలకుదురు గ్రామానికి చెందిన రోహిత దస్తావేజు లేఖరి వద్ద సహాయకుడిగా పనిచేస్తున్నాడు. దీక్షిత్ కొరియర్ సర్వీసులో ఉద్యోగి. చందు రియల్ ఎస్టేట్ చేస్తున్నాడు. ఈ ముగ్గురు స్నేహితులు ఆదివారం సాయంత్రం భారతీనగర్‌లో ఉన్న నెట్ క్రికెట్‌కు వెళ్లారు. అక్కడ ఆడుకున్న తర్వాత వారితోపాటు ఉన్న అజయ్ అనే స్నేహితుడి పుట్టిన రోజు వేడుకను బార్‌లో జరుపుకున్నారు. మొత్తం అంతా కలిసి మైకం తెలియకుండా తాగారు. తర్వాత కారులో రహదారులపై వీరంగం చేశారు. భారతీనగర్‌లో డెలివరీ ఇచ్చి వెళ్లిపోతున్న బ్లింకిట్ ఉద్యోగి కె.రాజశేఖర్‌రెడ్డిని పిలిచి గొడవ పడ్డారు. ద్విచక్ర వాహనం తాళాలు ఇవ్వాలని అసభ్యకరంగా దూషించారు. ఇది చూసిన అదే సంస్థలోని ఏజెంట్ నాగిపోగు రమేష్ అక్కడికి వెళ్లాడు. అతడినీ బూతులు తిట్టారు. గొడవ జరుగుతుండడం బ్లింకిట్ సంస్థ అధికారులకు తెలియజేయడానికి రాజశేఖర్ రెడ్డి వెళ్లాడు. కార్యాలయం నుంచి ఉద్యోగులు వచ్చేసరికి రమేష్ తలను నేలకేసి కొట్టారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. రక్తపు మడుగులో ఉన్న రమేష్‌ను తోటి ఉద్యోగులు అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తరలించగా అతడు ప్రస్తుతం అపస్మారకస్థితిలో ఉన్నాడు.

ఇక్కడి నుంచి కారులో వెళ్లిపోయిన ముగ్గురూ పిన్నమనేని పాలిక్లీనిక్ రోడ్డులో ఆటోడ్రైవర్‌ను ఆపి దాడి చేశారు. ఈ ఘటనలపై పటమట, మాచవరం పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఈ ముగ్గురు నిందితులను పటమట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కవుల రచనలు ప్రజా జీవితాన్ని ప్రతిబింబించాలి : గోరేటి వెంకన్న

కంచికచర్ల రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): కవుల రచనలు ప్రజా జీవితాన్ని ప్రతిబింబించేలా, సమాజాన్ని చైతన్యవంతం చేసే ఉండాలని ప్రజా కవి, తెలంగాణ ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న అన్నారు. సోమవారం ఆయన కంచికచర్లకు చెందిన కవి వర్ధమాన రచయిత తంగిరాల సోని ఇంటిలో కొంత సేపు గడిపారు. సోనీ రాస్తున్న కవితలు, రచనలు ఆసక్తిగా చదివారు. ఈనెల 18న విజయవాడలో కలేకూరి ప్రసాద్ సంస్మరణ సభను విజయవంతం చేయడంపై ఆమెను అభినందించారు. సోనీ కవితా సంపుటికి ఆయన బ్లాక్ వాయిస్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో కవులు కోయి కోటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టు తాడి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం బాటిళ్లు స్వాధీనం

తిరువూరు, మే 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సోమవారం తమ సిబ్బంది దాడులు నిర్వహించినట్టు సీఐ జె.శ్రీనివాస్ తెలిపారు. ఊటుకూరు వద్ద ద్విచక్ర వాహనంపై 78 తెలంగాణ మద్యం సీసాలు రవాణ చేస్తున్న గుండ్ల శేషగిరిరావు, గుండ్ల ఎల్లమ్మను అదుపులోకి తీసుకొని వారినుంచి మద్యం బాటిళ్లు, వాహనం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితుల్ని కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో మొబైల్ పెట్రోలింగ్ పార్టీ ఎస్సై వెంకట్‌కుమార్, సిబ్బంది కుటుంబరావు, వీరబాబు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత కొణిజర్ల

వత్సవాయి, మే 19 (ఆంధ్రజ్యోతి): వత్సవాయిలో ఈనెల 3వ తేదీ నుంచి 19 తేదీ వరకు ఐదు జిల్లాల స్థాయిలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ఖమ్మం జిల్లా కొణిజర్లకు చెందిన టీమ్ విన్నర్‌గా నిలిచి ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. సోమవారం జగ్గయ్యపేట ఆర్.ఆర్ టీమ్‌కు, కొణిజర్ల టీమ్‌కు జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మొదటిగా కొణిజర్ల 4 వికెట్లు నష్టానికి 20 ఓవర్లలో 163 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జగ్గయ్యపేట ఆర్.ఆర్ టీమ్ 14 ఓవర్లకు ఆలౌట్ అయ్యి 114 పరుగులు మాత్రమే చేసి ఓటమి చెందింది. రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ప్రథమ బహుమతి రూ.40 వేలను కొణిజర్లకు, ద్వితీయ బహుమతి రూ.30 వేలను జగ్గయ్యపేట ఆర్ఆర్ టీమ్‌కు, తృతీయ బహుమతి రూ.20వేలను స్టార్ వత్సవాయి జట్లకు నిర్వాహకులు అందించనున్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ చేతుల మీదుగా బహుమతులు అందించనున్నట్టు ఆర్గనైజర్ ప్రభుదాసు, పీఈటీ బాబురావు తెలిపారు.

బదిలీలు, పదోన్నతుల్లో ప్రతిష్టంభన తొలగించాలి

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు డీ పీఆర్టీయూ వినతి

గవర్నర్‌పేట, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో ఏర్పడిన ప్రతిష్టంభన తొలగించి న్యాయం జరిగే విధంగా చొరవ చూపాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను, కోరారు. డి.శ్రీను నేతృత్వంలోని సంఘ ప్రతినిధి బృందం సోమవారం ఎమ్మెల్సీని ఆయన కార్యాలయంలో కలిసింది. బదిలీలు, పదోన్నతుల్లో ఏర్పడిన గందరగోళం, ఉపాధ్యాయుల్లో నెలకొన్న ఆందోళనలను వివరించింది. ఈ మేరకు వినతిపత్రం అందజేసింది. దీనికి స్పందించిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు అధికారులతో పాటు మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళతాని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ నేతలు జీవీఎస్ పెరుమాళ్ళు, జువ్వ జ్ఞానేశ్వరరావు, పి. నాగరాజు, కోట సుందర్‌రావు, రాఘవ శ్రీను, పీవీ రావు, లక్ష్మణరాజు, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఈ చెవి దిద్దులు తీసుకుని న్యాయం చేయండి

(5వ పేజీ తరువాయి)

పేర్కొంది. తన వద్ద అంత నగదు లేదని, తన కాపురం చక్కదిద్దమని కోరితే తనను, తన భర్తను ఒకే చోట కూర్చోబెట్టి మాట్లాడకుండా విడివిడిగా మాట్లాడిన రజనీ ఆ తర్వాత తన భర్త తరఫునే మాట్లాడుతోందని తెలిపింది. తనకు ఇద్దరు చిన్న పిల్లలున్నారని, తన కాపురం చెడగొట్టే ప్రయత్నం రజనీ చేస్తోందని ఆమె వాపోయింది. తనను రాష్ట్రపతి ఈ పోస్టులో నియమించారని, నీపై చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టిస్తానని రజనీ బెదిరించిందని పావని వివరించింది. ఈ అంశంపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా ఎస్పీ పెడన పోలీసులను ఆదేశించారు.

పొలం వద్దకు వెళ్లనివ్వడంలేదు.. న్యాయం చేయండి

తన పొలం వద్దకు వెళ్లనీయకుండా కొందరు తనను అడ్డుకుంటున్నారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ మోపిదేవి మండలం పెదప్రోలు గ్రామానికి చెందిన శ్రీలక్ష్మి అనే మహిళ కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి కలెక్టర్‌కు అర్జీ అందజేసింది. తన పొలం చుట్టు పక్కల వారు తన పొలం వద్దకు వెళ్లడానికి దారిలేదని చెబుతూ తనను అడ్డగిస్తున్నారని, పొలం సాగు చేసుకోనివ్వబోమని బెదిరిస్తున్నారని తనకు న్యాయం చేయాలని కోరింది.

'వందే భారత్' డిపో రెడీ!

(5వ పేజీ తరువాయి)

నడుచుకుంటూ అటు, ఇటు వెళ్లటానికి వీలుగా కాంక్రీట్ స్లాబ్స్ ఏర్పాటు చేశారు. విజయవాడ - చెన్నై మధ్యన నడిచే వందేభారత్ రైలుకు ప్రస్తుతం విజయవాడలోనే మెయింట్‌నెన్స్ చేస్తున్నారు. ప్రస్తుతం విజయవాడ - చెన్నై వందేభారత్ రైలుకు కోచింగ్ డిపోలో మెయింట్‌నెన్స్ పనులు జరుగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో అందుబాటులోకి రాగానే.. ఇక్కడి నుంచే వందేభారత్ రైళ్లకు ప్రత్యేకంగా మెయింట్‌నెన్స్ చేస్తారు. మెయింట్‌నెన్స్ చార్ట్ ప్రకారం రైలును ప్రయాణ అవసరాలకు తగ్గట్టుగా ఇక్కడ సిద్ధం చేస్తారు. ఎలాంటి రిపేర్లు ఉన్నా కూడా ఇక్కడే నిర్వహిస్తారు. వందేభారత్ మెయింట్‌నెన్స్ కోసం పక్కనే ఒక పరిపాలనా భవనాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ వందేభారత్ విభాగానికి సంబంధించిన విభాగాధిపతులు, ఇతర ఉద్యోగులు, సిబ్బంది విధులు నిర్వహిస్తారు. నిరంతర నీటి సరఫరాకు వీలుగా ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

అనధికార కట్టడం కూల్చివేత

పెనమలూరు, మే19 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీ పరిధిలోని యనమలకుదురు శివపార్వతీనగర్‌లో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సోమవారం కూల్చివేశారు. మునిసిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదని, బిల్డర్‌లు అందరూ సహకరించాలని...లేని పక్షంలో వారిని బ్లాక్ లిస్టులో పెడతామని కమిషనర్ భవానీప్రసాద్ హెచ్చరించారు.



కాలుష్య కోరల్లో!

- పుల్లేరు కాల్వలో కలిసిపోతున్న డ్రెయినేజీల మురుగు
- చెత్త, పాలిథిన్ కవర్లు, వ్యర్థాలు కాల్వలోనే
- దుర్గంధంతో అల్లాడిపోతున్న స్థానికులు
- పట్టించుకోని ఇరిగేషన్, నగర పంచాయతీ అధికారులు



తోట్లవల్లూరు రోడ్డులో పుల్లేరు కాల్వ కట్ట పొడవునా చెత్త, వ్యర్థాలు

(ఉయ్యూరు - ఆంధ్రజ్యోతి)

ఉయ్యూరు పట్టణ పరిధిలో పుల్లేరు కాల్వలో పేరుకుపోతున్న చెత్త మురుగు నీటిలో కుళ్లి భరించ లేని దుర్గంధం వ్యాపిస్తుంది. పుల్లేరుకాల్వ కట్ట పొడవునా ఓ వైపున ఆక్రమించుకుని నివాసాలు ఏర్పరుచుకున్న వారు, మరోవైపు తోట్లవల్లూరు రోడ్డు వెంబడి కాల్వకట్ట ఆక్రమించుకుని వ్యాపారాలు చేసేవారు చెత్త కాల్వలో పోసి డంపింగ్ యార్డులా ఉపయోగించుకుంటున్నారు. ఇదీ చాలద న్నట్టు నగర పంచాయతీ పారిశుధ్య సిబ్బంది రోడ్లు శుభ్ర పరచి, ఇళ్ల నుంచి సేకరించిన చెత్త, వ్యర్థాలు తీసుకువచ్చి కాల్వలో పోస్తూ కాలుష్య కారకానికి మేము సైతం అంటూ తమపని తాము చేసుకుంటు న్నారు. కాల్వలో నీరు లేక పోగా, పట్టణంలో డ్రెయినేజీలను కాల్వలో కలపడం వల్ల మురుగునీరు పారుతుంది. శ్రీనివాస కళాశాల సమీపాన వీరభద్రరావు వంతెన వద్ద నుంచిఫ్లోరా స్కూల్ వద్ద వంతెన దాటి కాల్వ పొడవునా చెత్త దర్శన మిస్తూ డంపింగ్ యార్డుల తయారైంది. కాల్వలో చెత్త పోసి డంపింగ్ యార్డుల తయారు చేస్తున్నా నగర పంచాయతీ అధికారులకు కన్పించక పోవడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పుల్లేరు కాల్వ డంపింగ్ యార్డులా కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



వీరభద్రరావు వంతెన వద్ద పుల్లేరు కాల్వలో కలుస్తున్న మురుగు

చర్యలు తీసుకుంటాం

కాల్వలో చెత్తపోయకుండా చర్యలు తీసుకుంటాం. కాల్వ మాపరిధిలోది కాదు, కాల్వలో చెత్తవేయకుండా ఇరిగేషన్ శాఖ చూసుకోవాలి. చెత్త పట్టణంలో దైనప్పటికి తీయాల్సింది. ఇరిగేషన్ శాఖ వాళ్ల. కాల్వలో చెత్తపోయవద్దని పారిశుధ్య కార్మికులను ఆదేశిస్తాం. అందుకు ప్రజలు కూడా సహకరించాలి.

- పి. వెంకటేశ్వరరావు, కమిషనర్ నగరపంచాయతీ

రేపటి నుంచి దాసాంజనేయస్వామి ఆలయ వజ్రోత్సవాలు

హనుమాన్‌జంక్షన్, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీతారామ దాసాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 21 నుంచి 25 వరకు వజ్రోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు పల్నాటి సత్యనారాయణ, చోడె వెంకయ్య కుటుంబ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు అర్చనలు, భజనలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. 25న ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమం ఉంటుందని భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

ఉయ్యూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : గండిగుంట, పెదఓగిరాల 33/11 కేవీ సబ్‌స్టేషన్లకు మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు గండిగుంట, ఎగినపాడు, నాగన్నగూడెం, ఆకునూరు, చినఓగిరాల, పెదఓగిరాల గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు ఈఈ కృష్ణనాయక్ తెలిపారు.



న్యాయవాధులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి గోపి

ఉయ్యూరు కోర్టును సందర్శించిన జిల్లా న్యాయాధికారి గోపి

ఉయ్యూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి.గోపి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కోర్టు శాశ్వత భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయింపు గురించి మండల తహసీల్దార్ సురేశ్ కుమార్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కోర్టు సందర్శనకు వచ్చిన ప్రధాన న్యాయమూర్తిని ఉయ్యూరు బార్ అసోసియేషన్, సీనియర్ న్యాయవాదులు రాంబాబు, చంటిబాబు తదితరులు శాలువాతో సత్కరించారు.



కానుమోలు గ్రంథాలయంలో క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

లక్ష్యసాధనకు ఇండోర్ గేమ్స్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : లక్ష్యసాధన, ఏకాగ్రతతో పాటు క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు క్యారమ్స్, పద వినోదం లాంటి ఆటలు దోహదపడతాయని గ్రంథాలయాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. కానుమోలు గ్రంథాలయ ఆవరణలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. రాజా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివరాయల్ ఆటలు, పాటల పోటీలను పర్యవేక్షించారు.

● వీరవల్లి గ్రంథాలయాధికారి స్వర్ణలతా దేవి ఆధ్వర్యంలో హిందీ గ్రామర్, భారతీయ శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్ జీవితచరిత్రపై పుస్తకపఠనం, సమీక్ష నిర్వహించారు.

ఆహ్లాదకరంగా..

కంకిపాడు : వేసవిలో చిన్నారులు ఎండలో తిరగ కుండా గ్రంథాలయాల ద్వారా తమ మేధస్సుకు పదును పడుతున్నారని కంకిపాడు గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో సోమవారం చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆట పాటలాడారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, వేసవి సెలవులు ప్రారంభం అయిన నాటి నుంచి గ్రంథా లయానికి చిన్నారులు పెద్దసంఖ్యలో హాజరవుతున్నారన్నారు. వారికి అవసరమైన పుస్తకాలు, చెస్, కేరం బోర్డు వంటి అనేక ఆటలను వారు సద్వినియోగ పరుచుకుంటున్నారని తెలియజేశారు.

సెల్‌ఫోన్ రిపేరింగ్ కోర్సులో శిక్షణ 26 నుంచి

ఉంగుటూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : వివిధ చేతివృత్తుల్లో ఉచిత శిక్షణ అందించి, నైపుణ్యాలను మెరుగుపరచడంద్వారా స్వశక్తితో స్వయంసమృద్ధి సాధించే దిశగా యువతను ప్రోత్సహించేందుకు యూనియన్‌బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణాసంస్థ(యూబీఆర్‌ఎస్‌ఈటీఐ)కృషి చేస్తోందని శిక్షణాకేంద్రం డైరెక్టర్ వి.అమరేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్ ప్రాంగణంలోని యూబీఆర్‌ఎస్‌ఈటీఐలో ఈనెల 26 నుంచిసెల్‌ఫోన్ రిపేరింగ్ కోర్సులో ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నెలరోజుల కాలవ్యవధితో కూడిన ఈ కోర్సులో శిక్షణపొందేందుకు 18నుంచి 45ఏళ్ల మధ్య వయసు టెన్త్ చదివి, తెలుగులో చదవటం, రాయడం వచ్చి వుండాలన్నారు. వివరాలకు 6304254730, 9490011081 నెంబర్లలో సంప్రదించాలని అమరేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యం వెలికితీసి క్రీడల పట్ల ఆసక్తితో పాటు క్రీడాస్ఫూర్తిని పెంపొం దించేందుకు కేపీఎల్ క్రికెట్ టోర్నీ లాంటివి ఉపయోగపడతాయని రామిశెట్టి అనూష అన్నారు. కొత్తపల్లికి చెందిన యువత తమస్నేహితుడు క్రికెటర్ అయిన రామిశెట్టి దుర్గాప్రసాద్ జ్ఞాపకార్థం కేపీఎల్(కొత్తపల్లి క్రికెట్ లీగ్) క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు సోమవారం రామిశెట్టి దుర్గాప్రసాద్ తల్లి అనూష చేతుల మీదుగా ట్రోఫీ, నగదు బహు మతి అందజేశారు. కొత్తపల్లి, బిళ్లనపల్లి, మడిచర్ల, మీర్జాపురం, తదితర గ్రామాలకు చెందిన 13జట్లు కేపీఎల్ టోర్నీలో పాల్గొన్నాయని, మడిచర్ల జట్టు విజేతలుగా నిలువగా, కొత్తపల్లి జట్టు ద్వితీయ స్థానం సాధించింది. విన్నర్స్ జట్టుకు ట్రోఫీ, రూ.10వేల నగదు బహుమతి, ద్వితీయ స్థానం సాధించిన కొత్తపల్లి జట్టుకు ట్రోఫీ, రూ.5వేల సగదు బహుమతి అందజేశారు.



విజేతలకు ట్రోఫీ, నగదు బహుమతి అందిస్తున్న రామిశెట్టి అనూష

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

ఉయ్యూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తు న్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లి, వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని మండల టీడీపీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబ రావు అన్నారు. ఇటీవల జరిగిన పార్టీ సంస్థాగత ఎన్నికల్లో ఉయ్యూరు పట్ట ణ, మండల పరిధి గ్రామ పార్టీ అధ్యక్షులు, ఇతర కార్యవర్గానికి జబర్లపూడి సర్పంచ్ సూరపనేని శేషవరప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక కాటూరు రోడ్డులో ఓ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన అభినం దన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కూటమి విజయానికి అందరం కలసి కృషి చేద్దామన్నారు. జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోలి వసంతకుమార్, కొండా ప్రవీణ్ నూతన కార్యవర్గాన్ని సత్కరించారు.



టీడీపీ మండల అధ్యక్షుడు కుటుంబరావును అభినందిస్తున్న పార్టీ గ్రామ నాయకులు



ఉప్పలూరు ఉప సర్పంచ్ కె.కనకారావును అభినందిస్తున్న సర్పంచ్ లాం సోనియా

ఉప్పలూరు ఉప సర్పంచ్‌గా కనకారావు

కంకిపాడు, మే 19 (ఆంధ్రజ్యోతి): ఉప్పలూరు ఉప సర్పంచ్‌గా కలపాల కనకారావు ఎన్నికయ్యారు. గతంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో బొడ్డు నాగమల్లేశ్వరరావు రెండున్నర సంవత్సరాలు ఉపసర్పంచ్‌గానూ మరో రెండు న్నరేళ్ల కలపాల కనకారావు ఉప సర్పంచ్‌గా కొనసాగాలన్న తీర్మానం పంచాయతీ పాలకవర్గం తీసుకుంది. అందులో భాగంగా ఈ నెల 19న కలపాల కనకారావు నియమితులయ్యారు. ఉప సర్పంచ్‌గా నియమితులైన కనకారావును సర్పంచ్ లాం సోనియా, టీడీపీ గ్రామ అధ్యక్షులు చలసాని రాధాకృష్ణమూర్తి, లాం సురేష్, మాజీ ఉపసర్పంచ్ బొడ్డు నాగమల్లేశ్వరరావు, వార్డు సభ్యులు ఇట్టా ఏసుబాబు, జి. రమాదేవి, పి. బుజ్జమ్మ, పి. వీరాస్వామి, బి. కొటమ్మ అభినందించారు.



ఉత్తమ విద్యార్థిని జి.మౌనికకు గోల్డ్ మెడల్ అందజేస్తున్న తాతినేని శ్రీహరిరావు

గుణాత్మక విద్యాబోధన అవసరం

ఉయ్యూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచస్థాయిలో పోటీకి తగినట్టుగా కోర్సులను ప్రవేశపెట్టి కళాశాలలు గుణాత్మకమైన విద్యను బోధించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎస్ఏజీటీఈ ఉపాధ్యక్షుడు వి.నాగభూషణరావు సూచించారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల సర్ణోత్సవం పురస్కరించుకుని సోమవారం ఎచివర్స్‌డే నిర్వహించారు. కళాశాల కన్వీనర్ తాతినేని శ్రీహరిరావు మాట్లాడుతూ, కళాశాలలో చదివిన విద్యార్థులు ఎందరో అత్యున్నత స్థాయికి చేరుకున్నారని పేర్కొన్నారు. ఈ సదర్భంగా బీకాం కంప్యూటర్ విభాగంలో అత్యుత్తమ విద్యార్థిని జి.మౌనికకు బంగారు పతకం అందజేశారు. పేద విద్యార్థులకు రూ. 88 వేలు స్కాలర్‌షిప్పులుగా అందించారు. కమిటీ సభ్యులు ఎం.వినయ్‌కుమార్, దుర్గాప్రసాద్, జ్ఞాన వీరలక్ష్మి, కృష్ణ మోహనరావు, కళాశాల ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, బుచ్చిరెడ్డి, జీజేపీ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య జీవితం ఆదర్శప్రాయం

పెనమలూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : పోరంకిలో సోమవారం జరిగిన కామ్రేడ్ పుచ్చలపల్లి సందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కామ్రేడ్ నారిన వెంకట్రావు, అనుమోలు ప్రభాకరరావు, ఖాసీంలు మాట్లాడుతూ, ఇప్పుడున్న పరిస్థితుల్లో కులాలకు, మతాలకు అతీతంగా అందరూ ఐక్యంగా ఉండాలని, పుచ్చలపల్లి చూపిన బాటలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో పోతులూరి శ్రీనివాసరావు, ఎస్‌కే బాబు, వీసం సోమశేఖర్, లక్ష్మీనారాయణ, రవణమ్మ, పద్మ, రత్నకర్ల, దాసరి డేవిడ్, వెంకటరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉయ్యూరు : సుందరయ్య నీతి, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనమని సీపీఎం సీనియర్ నాయకుడు రత్నం భాస్కరరావు, రాష్ట్ర నాయకుడు ఎం.హరిబాబు కీర్తించారు. సుందరయ్య 40వ వర్ధంతి పురస్కరించుకుని స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పవన్ కుమార్, బి.కీర్తి, బి.రాజేశ్, తిరుపతయ్య, నిమ్మాది గోపాల్, లక్ష్మణరావు, రవి పాల్గొన్నారు.







ఉయ్యూరులో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు.. తేలప్రోలులో.. జంక్షన్‌లో



పోరంకిలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం శ్రేణులు

హనుమాన్‌జంక్షన్ : సుందరయ్య అందించిన త్యాగపూరిత జీవితం ఆదర్శనీయమని సీపీఎం బాపులపాడు మండల కార్యదర్శి బేత శ్రీనివాసరావు తెలిపారు. సుందరయ్య 40వ వర్ధంతిని బాపులపాడు మండలంలో సీపీఎం నాయకులు జోహార్లు అర్పించారు.

ఉంగుటూరు : సుందరయ్య 40వ వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో తేలప్రోలు, ఆత్కూరు, ఉంగుటూరు, వెన్నూతల, ఎలుకపాడు, పెదఅవుటపల్లి, నందమూరు, మానికొండ, ముక్కపాడు తదితర గ్రామాల్లో పార్టీశ్రేణులు నిర్వహించాయి. మాగంటి సాంబశివరావు, టీవీ లక్ష్మణస్వామి, అజ్మీర వెంకటేశ్వరరావు, టీవీ రామ్మోహనరావు, సుబ్బారెడ్డి, పిల్లి రాజారావు, పి.దుర్గారావు(నాని), ఎం.సంతోష్, కే.ప్రసంగి, రంగారావు, యాకోబు తదితరులు పాల్గొన్నారు.



ఆలయం వద్ద కోలాటం

కన్నుల పండువగా ఉత్సవాలు

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

హనుమాన్‌జంక్షన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అభయాంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న 24వ హనుమజ్జయంతి ఉత్సవాలు సందర్భంగా కళావేదికపై కళాకారుల నిర్వహిస్తున్న వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను రంజిం పచేస్తున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారికి 1008 చామంతి పూలతో పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా బిళ్లనపల్లి గ్రామానికి చెందిన కోదం డరామాం జనేయ భజన సమాజం హనుమాన్‌చాలీసా పారాయణం, సాయికృష్ణ కోలాట బృందం కోలాటం నిర్వహించాయి. ఆదివారం రాత్రి కళావేదికపై నంది అవార్డు గ్రహీత భీమవరం కళాకారుడు రఘు ప్రదర్శించిన మిమిక్రి, విజయ దుర్గా నాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర కాటిసీను ఆహూతులను ఆనందపరిచాయి. కార్యక్రమాలను ఈవో పి.తారకేశ్వరరావు, కూటమి నాయకులు వేమూరి శ్రీనివాసరావు, మట్టా శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి

- హైవే అధికారుల నిర్లక్ష్యం
- ముందే హెచ్చరించిన ఆంధ్రజ్యోతి
- అయినా స్పందించని హైవే అధికారులు


మృతుడు సాంబయ్య

ఇబ్రహీంపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): హైవే అధికారుల నిర్లక్ష్యం ఓ ఆటో డ్రైవర్ ప్రాణాలను బలి తీసుకుంది. ఇబ్రహీంపట్నం - చత్తీస్‌గఢ్ జాతీయ రహదారిలో హైవే అధికారులు ఏర్పాటు చేసిన డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో కొండపల్లి శాంతినగర్ డౌన్‌లో జాతీయ రహదారిపై వర్షపు నీరు భారీగా నిలుస్తుంది. ఈవిషయాన్ని ఈనెల 17న పల్లపు ప్రాంతాలు జలమయమని హైవే అధికారులు తీరుతో జాతీయ రహదారిపై నీరు నిలుస్తున్నాయని హెచ్చరించినా స్పందించలేదు. ఈక్రమంలో ఈనెల 18న కురిసిన వర్షానికి మరోమారు జాతీయ రహదారిపై శాంతినగర్ వద్ద భారీగా వర్షపు నీరు నిలిచింది. కొండపల్లిలో ఎస్టీ కాలనీలో ఉండే టీడీపీ ఎస్టీ సెల్ కార్యకర్త కంపా సాంబయ్య (59) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. సోమవారం జి.కొండూరు వైపు ఆటోలో వెళుతూ శాంతినగర్ వద్ద పల్లపు ప్రాంతాల్లో నిలిచిన నీటిని తప్పించే క్రమంలో వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తాపడి సాంబయ్య తీవ్రంగా గాయపడి అపస్మార స్థితికి చేరుకున్నారు. చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులు ముందే స్పందించి ఉంటే..

జాతీయ రహదారిపై కిలోమీటర్ దూరం వరకు చెరువును తలపించేలా నిలుస్తున్న వర్షపు నీటిని బయటకు పంపితే ఇలాంటి రోడ్డు ప్రమాదాలు జరిగేవి కావని పలువురు అభిప్రాయం పడుతున్నారు. ఇప్పటికైనా మరో ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

పలువురు సంతాపం

కంపా సాంబయ్య ఆకాల మరణం పార్టీకి తీరని లోటని టీడీపీ మండలాధ్యక్షుడు రామినేని రాజశేఖర్ (రాజ), కొండపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు చుట్టుకుదురు శ్రీనివాసరావులు అన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఏపీ ఈఏపీసెట్‌కు 95.71శాతం మంది హాజరు

మచిలీపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లాలో సోమవారం జరిగిన ఏపీ ఈఏపీసెట్‌కు 95.71 శాతం మంది హాజరయ్యారు. ఉదయం, మధ్యాహ్నం సమయంలో రెండువిడతలుగా జరిగిన పరీక్షకు 583 మంది హాజరుకావాల్సి ఉండగా, 558 మంది హాజరయ్యారు.

ద్వీపానికి ఉక్కు కవచం

- రూ. 2.65 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 200 మీటర్ల మేర వరద తాకే పశ్చిమ ప్రాంతంలో షీట్ ఫైలింగ్ పనులు
- 9 మీటర్ల నదీ లోతున షీట్ ఫైలింగ్ వేయనున్న బీఐటీసీ
- మేజ్ గార్డెన్, గేమింగ్ జోన్ పునరుద్ధరణ పనులు


ఐలాండ్‌కు తూర్పు భాగంలో వేసిన షీట్లు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: ఎంత పెద్ద వరద వచ్చినా భవానీ ద్వీపాన్ని వరద దుర్భేద్యంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2.65 కోట్ల నిధులను భవానీ ఐల్యాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ)కు విడుదల చేసింది. ఈ నిధులతో స్టీల్ షీట్ ఫైలింగ్ చేపడతారు. భవానీ ద్వీపానికి పశ్చిమ భాగాన వరద తాకే ప్రాంతంలో ఈ షీట్ ఫైలింగ్ చేపడతారు. మొత్తం 200 మీటర్ల వరకు మొదటి దశలో స్టీల్ షీట్ ఫైలింగ్ చేపడతారు. మొత్తం 9 మీటర్ల పొడవైన షీట్ ఫైల్స్‌ను భవానీ ద్వీపం ఒడ్డున నదీగర్భంలోకి దించుతారు. ఒక షీట్‌కు మరొక షీట్‌కు జాయింట్ ఉంటుంది. షీట్లను జాయింట్లకు అనుసంధానం చేసి వైబ్రేటర్ మెషీన్ ద్వారా భూమిలోకి దింపుతారు. ఒక్కసారి ఈ స్టీల్ షీట్ ఫైలింగ్‌ను చేసిన తర్వాత ద్వీపానికి గట్టిగా వరద తాకినపుడు కొట్టుకుపోవటం ఉండదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒకసారి భవానీ ఐల్యాండ్ తూర్పు, ఉత్తర భాగాల్లో కొంతమేర షీట్ ఫైలింగ్ చేపట్టారు. దీంతో అప్పట్లో ఎంత పెద్ద వరదలు వచ్చినా షీట్ ఫైలింగ్ చేసిన ప్రాంతంలో మాత్రం ద్వీపానికి ఏమీ కాలేదు. అప్పట్లో 5 మీటర్ల లోతున ఒడ్డునే షీట్ ఫైలింగ్ చేశారు. కృష్ణానదికి ప్రధానంగా వరద వచ్చినపుడు పశ్చిమ భాగంలోనే తాకుతుంది. గతంలో పశ్చిమ ప్రాంతం చాలావరకు నిరుపయోగంగా ఉండేది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దీన్ని కూడా అందుబాటులోకి తెచ్చి పాత్‌వేలు, సెల్ఫీ పాయింట్స్, ఫ్లవర్ గార్డెన్స్, గేమింగ్ జోన్, మేజ్ గార్డెన్, మిర్రర్ మేజ్, రోబోటిక్ పార్క్ వంటివి ఏర్పాటు చేశారు. ఇటీవల వచ్చిన భారీ వరదలకు ఈ ప్రాంతం వైపు చాలావరకు భవానీ ద్వీపం కొట్టుకుపోయింది. భారీగా ఇసుక కొటుకటకొచ్చింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ద్వీపం పునరుద్ధరణ పనుల విషయంలో బీఐటీసీ అధికారులు ప్రణాళికగా వెళుతున్నారు. గతంలో జరిగిన నష్టం భవిష్యత్తులో జరగకుండా ఉండాలంటే ద్వీపం చుట్టూ పూర్తిస్థాయిలో స్టీల్ షీట్ ఫైలింగ్ వేయాలని భావిస్తున్నారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా రూ.2.65 కోట్ల నిధులను కేటాయించింది. ఈ నిధుల్లో సింహభాగం స్టీల్ షీట్ ఫైలింగ్‌కు కేటాయించాలని, మిగిలిన నిధులను గేమింగ్ జోన్, మేజ్ గార్డెన్ పునరుద్ధరణకు ఖర్చు చేస్తారు. తొలి దశలో 200 మీటర్ల వెంబడి పశ్చిమ దిశలో షీట్ ఫైలింగ్ చేయాలని నిర్ణయించారు. ద్వీపం పశ్చిమ భాగం లోతు ఎక్కువగా ఉంటుంది కాబట్టి గతంలో మాదిరిగా 5 మీటర్ల లోతున కాకుండా ఈ సారి 9 మీటర్ల లోతున షీట్ ఫైలింగ్ చేయాలని నిర్ణయించారు. పూర్తిస్థాయిలో చేయాలంటే నిధుల అవసరం ఏర్పడుతుంది కాబట్టి సీఆర్‌డీఏను డబ్బులు ఇవ్వమని అడిగారు. ఎందుకో అక్కడి సానుకూల స్పందన రావటం లేదని తెలుస్తోంది. మంత్రి నారాయణతో మాట్లాడి సీఆర్‌డీఏ ద్వారా ఫండ్స్ మొబిలైజేషన్ చేయాలని బీఐటీసీ భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఒకవేళ సీఆర్‌డీఏ ఆసక్తి చూపకపోతే ఎన్‌జీవోల నుంచి కానీ, సీఎస్ఆర్ ఫండ్స్ కోసం కృషి చేయాలని బీఐటీసీ అధికారులు భావిస్తున్నారు.

స్టీల్ షీట్ ఫైలింగ్‌తో వరద దుర్భేద్యంగా భవానీ ఐలాండ్


ఐలాండ్‌కు ఉత్తర భాగంలో వేసిన షీట్లు

అర్జీల పరిష్కారానికి కృషి

- విశ్వాసం పెరగటం వల్లే భారీగా అర్జీలు: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



జగ్గయ్యపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారమవుతున్నందున, ప్రభుత్వ యంత్రాంగంపై విశ్వాసం పెరగటంతోనే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు బాధితుల నుంచి అర్జీలు భారీగా వస్తున్నాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చెప్పారు. జగ్గయ్యపేట బీ-కన్వెన్షన్‌లో సోమవారం కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో జరిగిన నందిగామ డివిజన్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, జిల్లా అధికారులతో కలిసి పాల్గొని స్వయంగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవికాలాన్ని, ప్రజలకు అందుబాటులో ఉండేలా జిల్లా కేంద్రాల నుంచి నియోజకవర్గ కేంద్రాల స్థాయిల్లో పీజీఆర్ఎస్‌ను నిర్వహిస్తున్నామని, తిరువూరులో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు, జగ్గయ్యపేట పీజీఆర్ఎస్‌కు మంచి స్పందన లభించిందన్నారు.

పీజీఆర్ఎస్‌కు 500 అర్జీలు

జగ్గయ్యపేటలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 461 అర్జీలు రాగా, సింహభాగం రెవెన్యూ సమస్యలే వచ్చాయి. ఇనామ్ భూములు, భూ సర్వేలో హెచ్చు తగ్గులపై, భూ వివాదాలు, 22ఏలో మినహాయింపులు, ల్యాండ్ సీలింగ్ వివాదాలపై 240కి పైగా అర్జీలు వచ్చినట్టు కలెక్టర్ తెలిపారు. వచ్చిన అర్జీల్లో అధికంగా జగ్గయ్యపేట మండలం నుంచి 222, వత్సవాయి నుంచి 24, పెనుగంచిప్రోలు నుంచి 56, నందిగామ మండలం నుంచి 222, చందర్లపాడు నుంచి 8, వీరులపాడు నుంచి 4, కంచికచర్ల నుంచి 8 అర్జీలు వచ్చాయి. గ్రామ/వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి బి.జ్యోతి, నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, డీఆర్‌డీఏ ఏపీడీ ఏఎన్వీ నాంచార రావు, డీపీవో లావణ్యకుమారి, డీఎస్పీలు ఏబీజీ తిలక్, వెంకటేశ్వర రావు పాల్గొన్నారు. కాగా ఆఫ్‌లైన్‌లో మరో 40 అర్జీలు వచ్చినట్టు జగ్గయ్యపేట తహసీల్దార్ మనోహర్ తెలిపారు.

- 20న సీఎంతో వీడియోకాన్ఫరెన్స్: ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ



మచిలీపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ప్రజలనుంచి ఇచ్చే అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సోమవారం అధికారులతో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 20న ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారంపై జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులతో సమీక్ష ఉంటుందన్నారు. ఈలోగా పెండింగ్‌లో సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 22,770 అర్జీలు రాగా, వాటిలో 20,865 అర్జీలు పరిష్కారమయ్యాయన్నారు. ఇంకా 1,905 అర్జీలు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపారు. గడువుమీరిన అర్జీలు 13 ఉన్నాయని, వాటిని పరిష్కరించకపోవడానికి గల కారణాలపై ఆయా విభాగాల అధికారులను వివరణ కోరారు. కోర్టులకు సెలవులున్నప్పటికీ, కోర్టు కేసులకు సంబంధించిన అంశాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం-2013 పోస్టర్‌ను ఆవిష్కరించారు. వేసవి క్రీడాశిబిరాలను నిర్వహించే నిమిత్తం 45 శిక్షణా శిబిరాలకు రూ.5వేల విలువైన క్రీడా సామగ్రిని అందజేశారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి: డీఆర్‌వో

కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): అర్జీదారుడు సంతృప్తిచెందేలా స్పష్టమైన సమాచారంతో అర్జీలను పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీనరసింహం అన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసల్ సిస్టం (పీజీఆర్ఎస్)లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మీ నరసింహం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు ఆయా శాఖల అధికారులు కిందిస్థాయి సిబ్బంది నుంచి స్పష్టమైన సమాచారం తెచ్చుకుని అర్జీలు పునరావృతం కాకుండా సమస్యలు పరిష్కరించి సంతృప్తి పరచడమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. ఎండ వేడిమి లెక్కచేయక సుదూర ప్రాంతాల నుంచి వచ్చి అర్జీలను సమర్పిస్తున్న వారి ఆశలను నెరవేర్చాలని, వారి సమస్యలకు పరిష్కారం చూపడంలో జవాబుదారితనంఉండాలని డీఆర్వో లక్ష్మీనరసింహం అన్నారు.

ఖరీఫ్‌లో రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచాలి

- పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా చంద్రబాబు చర్యలు తీసుకోవాలి
- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు


మాట్లాడుతున్న మాజీ మంత్రి వడ్డే

గాంధీనగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖరీఫ్‌కు కాలువలు, డ్రైనేజీలు అభివృద్ధి చేయలేదని, రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచకపోవడం శోచనీయమని మాజీ మంత్రి శోభనాద్రీశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలో ఇలా జరగలేదని, పరిపాలనపై అవగాహన లేని వ్యక్తుల చేతుల్లో రాష్ట్ర పాలన సాగుతుందనే అనుమానం వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి జీవనాడి పోలవరం ప్రాజెక్టును కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఒక బ్యారేజ్‌గా, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా మార్చిందని మండిపడ్డారు. 150 అడుగుల ఎత్తుల నిర్మించాల్సిన ప్రాజెక్టును కేవలం 135 అడుగుల ఎత్తులో నిర్మించడం దుర్మార్గమన్నారు. ఈ ప్రాజెక్టుకు భవిష్యత్‌లో రూ.12157 కోట్లు మాత్రమే ఇస్తామని పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం దారుణమన్నారు. 194 టీఎంసీల నీటిని నిల్వ చేసే సామర్థ్యం నుంచి 109 టీయంసీలకే పరిమితం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. దీనిపై సీఎం చంద్రబాబు తక్షణమే స్పందించి ప్రధాని మోదీతో చర్చించాలని డిమాండ్ చేశారు. రాబోయే నాలుగేళ్లలో పూర్తిచేసే ప్రాజెక్టులపై దృష్టి సారించాలని చంద్రబాబుకు సూచించారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టు నిర్మించాలనే ఆలోచన విరమించుకుని రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత బొగ్గు గనులను కేటాయించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు

బస్టేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): విజయవాడ డిపో గ్యారేజీలో 20న జరిగే ఒక కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్టీసీ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్టు విజయవాడ డిపో మేనేజర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఉద్యోగులందరూ హాజరు కావాలని కోరారు. జోన్-2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణా అధికారులు ప్రశంసా పత్రాలను అందజేస్తారన్నారు.

ఆక్రమణ చెరలో అంపాపురం కోడు కాలువ

- వేలాది ఎకరాలకు సాగునీరు, గ్రామానికి తాగునీరు అందించే కాలువ
- గడ్డివాములు, పశువులపాకలు, వ్యర్థాలతో నిండిపోయిన పంట కాలువ.


ఆక్రమణలతో కుచించుకుపోయిన అంపాపురంలోని పంట కాలువ (కోడు కాలువ)

హనుమాన్‌జంక్షన్ రూరల్, ఆంధ్రజ్యోతి: వేలాది ఎకరాల వ్యవసాయ భూమికి సాగునీరందిస్తూ గ్రామానికి ఉన్న మంచినీటి చెరువు ద్వారా తాగునీరందించే పంటకాలువ (కోడు) వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకునేలా ఆక్రమణలతో నిండిపోయింది. గ్రామానికి తాగునీరు, అంపాపురం, ఎ.సీతారాంపురం, తేలప్రోలు, ఉమామహేశ్వపురం, బండారుగూడెం గ్రామాలకు చెందిన వేలాది ఎకరాల వ్యవసాయ భూముల సాగునీరందించే కోడుకాలువ ఆక్రమణలతో కుంచించుకుపోవడంతో పాటు గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో కనీసం నీరు ప్రవహించేందుకు కూడా వీలులేక చెత్తతో నిండిపోయింది. ఏలూరు కాలువ నుంచి ఎత్తిపోతల ద్వారా అంపాపురంలోని మూడు చెరువులకు నీరందించే పంటకాలువ అధికారుల నిర్లక్ష్యంతో మురుగుకాలువగా మిగిలిపోయింది. 15 అడుగులకు పైగా వెడల్పు, ఐదడుగుల లోతుతో ఉన్న పంట కాలువ ప్రస్తుతం ఐదడుగుల వెడల్పుతో రెండడుగుల లోతుతో మురుగునీరు నిలువ ఉంటోంది. ఇదే కాలువ ద్వారా అంపాపురం గ్రామానికి త్రాగునీరందించే ఊరచెరువుకు, 5 గ్రామాలకు చెందిన 2వేల ఎకరాలకు పైగా వ్యవసాయభూములకు మద్ది చెరువు, తొండం చెరువుల ద్వారా సాగునీరందించేలా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వ్యక్తిగత స్వార్థాలతో ఆక్రమణలకు గురై కుంచించుకుపోవడంతో పాటు పశువుల వ్యర్థాలు, చెత్తలో నిండిపోయి మురుగుకాలువను తలపిస్తోంది. ఈ కాలువ ద్వారా వచ్చే నీటితో ఊరచెరువు నింపితే గ్రామంలో వ్యాధులు ప్రబలే ప్రమాదముందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండువైపులా ఆక్రమణలు

పంట కాలువను రెండు వైపుల నుంచి కొందరు ఆక్రమించడంతో కుంచించుకుపోయింది. కొందరు వ్యక్తులు మెరకతోలి పశువుల పాకల నిర్మాణంతో పాటు గడ్డివాములు, పెంటపోగులు వేస్తూ ఆక్రమించారు. మరికొందరైతే ఏకంగా కాలువలోనే గోడలు నిర్మించారు. ఎన్నికల్లో ఆక్రమణలను తొలగిస్తామని హామీ ఇచ్చేంత పెద్ద సమస్యగా మారిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడం, అధికారులు నిర్లక్ష్యంతో ఆక్రమణలకు మరింత ఊతమిచ్చినట్లయింది.

భూమి విలువ పెరగడంతో..

జాతీయ రహదారికి పక్కనే ఉండటంతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు గ్రామానికి దగ్గరగా వెళుతుందని కొందరు వ్యక్తులు వెంచర్ల కోసం భూములు కొనడంతో భూమి విలువ అమాంతం పెరిగింది. దీంతో కొందరు వ్యక్తుల స్వార్థప్రయోజనాలకు గ్రామస్థులకు తాగునీరు, వేలాది ఎకరాలకు సాగునీరందించే పెద్ద కాలువ కాస్త మురుగునీటి కాలువగా మారిపోయింది. ఏలూరు కాలువ నుంచి అంపాపురం వరకున్న ఈ పంట కాలువ ఆక్రమణలను తొలగించి సరిహద్దులు నిర్ణయించాలని అంపాపురం గ్రామ ప్రజలు, రైతులు మే 16న పంచాయతీ కార్యదర్శి ద్వారా తహసీల్దార్‌కు అర్జీ పెట్టడంతో ఈ ఆక్రమణ పర్వం వెలుగుచూసింది.

ఎమ్మెల్యే ఆదేశాలు అమలు చేస్తారా..!

ఇటీవల బాపులపాడులో నిర్వహించిన ప్రజావేదికలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చెరువులు, కాలువల ఆక్రమణలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కానీ క్షేత్రస్థాయిలో కార్యాచరణ చేపట్టలేదని అధికారులపై మండిపడుతున్నారు. ఏలూరు కాలువ నుంచి అంపాపురం వరకూ గల (పంట కాలువ) కోడు కాలువ ఆక్రమణలను తొలగిస్తే అటు గ్రామ ప్రజలకు, ఇటు రైతులకు మేలుతో పాటు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సమస్య పరిష్కారమవుతుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

భవిష్యత్ ఎన్నికలకు నాంది మహానాడు

- బూత్ స్థాయి నుంచే పార్టీ పటిష్ఠత: మంత్రి కొల్లు రవీంద్ర


ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి రవీంద్ర, కొనకళ్ల నారాయణరావు తదితరులు

మోపిదేవి, మే 19 (ఆంధ్రజ్యోతి): త్వరలో రాబోతున్న స్థానిక సంస్థల ఎన్నికలు, 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రపంచం గుర్తించేలా పార్టీ విజయం సాధించేందుకు మహానాడు నాంది కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మోపిదేవిలో సోమవారం అవనిగడ్డ నియోజకవర్గ మినీ మహానాడులో కొల్లు రవీంద్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆర్టీసీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావుతో కలిసి వేదికపై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు పునాది వేసింది టీడీపీనేనని ముందుగా ఎన్టీ రామారావు అమలు చేయగా, ప్రస్తుతం సీఎం చంద్రబాబు కొనసాగిస్తున్నారన్నారు. నియోజకవర్గం, గ్రామం, బూత్ స్థాయి కుటుంబ సాధికార సమితి కమిటీల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా మినీ మహానాడు ఏర్పాటు చేశారని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అభినందించారు. మినీ మహానాడులో ఏకగ్రీవంగా 9 తీర్మానాలను ఆమోదించారు. ఉత్తరాఖండ్, పహల్గామ్ మృతులకు నివాళులర్పించారు. కోడూరు మండలంలో 5వేల ఎకరాలు సాగుకు నోచలేదంటూ వైసీపీ చేసిన ఆరోపణలు తిప్పికొడుతూ తీర్మానించారు. ఎదురుమొండి బ్రిడ్జి నిర్మాణానికి ఆమోదం తెలపటంతో ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఘంటసాల మండలాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించటం, గ్రామాల్లో అంతర్గత రహదారులను సిమెంట్ రోడ్లుగా నిర్మాణాలు చేపట్టినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ మినీ మహానాడు తీర్మానాలు ఆమోదించారు. పార్టీ మండలాధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ రావి దుర్గావాణి, జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లిఖార్జునరావు, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, నేతలు బొబ్బా గోవర్ధన్, సజ్జా చలపతి, తలశిల స్వర్ణలత, రావి నాగేశ్వరరావు, మోర్ల రాంబాబు, యాసం చిట్టిబాబు, తుమ్మల చౌదరిబాబు పాల్గొన్నారు.

సంక్షేమ, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పెడన: కూటమి ఏడాది పాలనలో రాష్ట్రంలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. టీడీపీ కార్యాలయంలో సోమవారం పెడన నియోజకవర్గ మినీమహానాడు జరిగింది. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ పదవులు పొందిన వారు ఇళ్లల్లో కూర్చోకుండా పార్టీ పటిష్టత కోసం పనిచేయాలన్నారు. వైసీపీ నేతల తప్పులే వారి పాలిట శాపాలుగా మారడంతో జైళ్లకు వెళుతున్నారన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని వైసీపీ సర్వనాశనం చేసిందని దుయ్యబట్టారు. జగన్‌ను పెద్ద సైకోగాను, మాజీ మంత్రి జోగి రమేష్‌ను చిన్న సైకోగాను నియోజకవర్గ పరిశీలకుడు గొట్టుముక్కల రఘురామరాజు అభివర్ణించారు. తొలుత ఎన్టీఆర్, కాగిత వెంకట్రావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మినీమహానాడు నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, సీనియర్ టీడీపీ నేత శలపాటి ప్రసాద్ సారథ్యంలో కొనకళ్ల బుల్లయ్య, శలపాటి ప్రసాద్, యక్కల శ్యామలయ్య, కూనపరెడ్డి వీరబాబు, పోతన స్వామి, వడుగు తులసీరావు, అబ్దుల్ ఖయూం, గోపీ నాగబాబు, హమీదుల్లా, బొర్రా కాశీ పాల్గొన్నారు.

పేదల ఇళ్లను త్వరగా నిర్మించండి


మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర, ఏపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి శివప్రసాద్

కార్పొరేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో పేదలకు అందించే ఇళ్లను త్వరగా నిర్మించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ ఎం.శివప్రసాద్ అన్నారు. ఈ మేరకు వీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నూతన మీటింగ్ హాలులో కాంట్రాక్టర్లు, లబ్ధిదారులు, హౌసింగ్ వీఎంసీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్లందరూ సహకరించి త్వరగా ఇళ్లు పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్లు, అధికారుల మధ్యనున్న సమన్వయ లోపాలను, సమస్యలను ముఖాముఖిగా చర్చించి పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహాయం అందుతుందని, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. వీఎంసీ చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ వర్క్స్ పి. సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ యూసీడీ విభాగం పీ వెంకట నారాయణ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

విఘ్నేశ్వరస్వామి హుండీ లెక్కింపు

గుడివాడ, మే 19(ఆంధ్రజ్యోతి) : స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న విఘ్నేశ్వరస్వామి దేవస్థాన హుండీ ఆదాయ లెక్కింపు ద్వారా రూ.4,71,048లు ఆదాయం సమకూరినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక దేవస్థానంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్ పర్యవేక్షణలో సోమవారం ధార్మిక సంస్థల సభ్యులచే లెక్కింపు ప్రక్రియను నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సాయన రాజేష్, దేవస్థాన సిబ్బంది మురళీ, నారాయణ, పాల్గొన్నారు.


హుండీ లెక్కింపులో పాల్గొన్న భక్తులు

మట్టి నమూనాల లక్ష్యాలను పూర్తి చేయాలి

● ఏవో బోలెం అనంతలక్ష్మి

గుడివాడ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో రైతులకు కావాల్సిన వరి విత్తనాలు ఎన్ని క్వింటాళ్లు కావాలో వీఏఏలు అంచనాలు రూపొందించాలని మండల వ్యవసాయ అధికారిణి బోలెం అనంతలక్ష్మి అన్నారు. సోమవారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఏఈవోలకు, వీఏఏలకు వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టి నమూనాల లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. మట్టి నమూనాలను పూర్తి చేసి గుడివాడ మార్కెట్ యార్డులో ఉన్న మట్టి నమూనా కేంద్రానికి తరలించాలని చెప్పారు. అన్నదాత సుఖీభవ ఈ నెల 20వ తేదీన ముగుస్తున్నందున ఎవరైనా ఉన్నట్లైతే త్వరగా పూరించాలని కోరారు. పీఎం కిసాన్ పథకం కింద రైతుల పేర్లు నమోదు చేసేటప్పుడు పట్టాదార్ పాస్‌పుస్తకాలు, జిరాక్స్ కాపీలు జత చేయాలని తెలిపారు. కొంత మంది వీఏఏలు ఆర్‌వోఆర్ కాపీలు చూసి నమోదు చేయిస్తున్నారని, అది జిల్లా స్థాయిలో ఒప్పుకోవటం లేదని తెలిపారు. వీఏఏలు ఖచ్చితంగా పట్టాదారు పాస్ పుస్తకాలు జిరాక్స్ కాపీలు జత చేయాలని కోరారు. ప్రతీ రైతు కుటుంబంలో ఇంటి దగ్గర కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసుకునేలా తగు సూచనలు, సలహాలు అందించాలని సిబ్బందికి తెలిపారు. ప్రతీ వీఏఏలు వారికి అందజేసిన టార్గెట్లు పూర్తి చేసి మండల లక్ష్యాలను పూరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు వేలూరి అనిత, దేవనబోయిన అనూష, దోమతోటి ప్రదీప్, వంజరపు సాయి, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏవో బోలెం అనంతలక్ష్మి


వినతిపత్రం అందజేస్తున్న హేమంత్‌కుమార్

సమస్యల పరిష్కారమే ధ్యేయం

గుడివాడ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి మీ కోసం కార్యక్రమం నిర్వహిస్తున్న తహసీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావు అన్నారు. సోమవారం మీ కోసం కార్యక్రమం తహసీల్దార్ కార్యాలయంలో జరుగగా, భూ సమస్యపై ఒక దరఖాస్తు వచ్చిందని తెలిపారు. గుంటాకోడూరు గ్రామానికి చెందిన యర్రపత్ని వెంకట కృష్ణ ప్రసాద్ తన పొలం 1.25 ఎకరాలు తన సర్వే నెంబర్ వేయటంతో కొంతమంది వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ విషయమై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. భూ వివాదాల పరిష్కారానికి ప్రాముఖ్యతనిస్తామని తెలిపారు. ఆర్‌ఐ నాగబాబు, రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుడివాడ: పట్టణంలోని రహదారులపై గోతులకు మరమ్మతులు చేయించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్‌కు న్యాయవాది హేమంత్‌కుమార్ అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే వాటిని పూడ్చాలని కోరారు.

పుష్కరాలకు గుడివాడ నుంచి ప్రత్యేక బస్సులు

● గుడివాడ డిపో మేనేజర్ జి.రాజేష్

గుడివాడ, మే 19(ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్‌ఆర్టీసీ గుడివాడ డిపో నుంచి తెలంగాణ రాష్ట్రం, కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి నది పుష్కరాలకు ఈ నెల 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్టు గుడివాడ డిపో మేనేజర్ జి.రాజేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుష్కరాలకు వెళ్లేవారు బృందాలుగా ఏర్పడితే వారి వద్దకు బస్సులను పంపుతామన్నారు. సూపర్ లగ్జరీ బస్సుకు ఒక్కొక్కరికి రూ.2000లు చార్జీ ఉంటుందని, ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్లు 94947 59318, 95500 62465, 73829 03299లకు సంప్రదించాలని డిపో మేనేజర్ రాజేష్ కోరారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

గుడ్లవల్లేరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : గత నెల రోజులుగా కౌతవరం సబ్‌స్టేషన్ పరిధిలో గుడ్లవల్లేరులో ఇష్టారీతిగా విద్యుత్ అంతరాయాలు కలుగుతున్నాయని రోజులో ఏకంగా ఎడు నుంచి తొమ్మిది గంటలు విద్యుత్‌ను నిలిపివేస్తున్నారని మండల టీడీపీ నాయకులు గుడ్లవల్లేరు ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, గుడ్లవల్లేరు మాజీ సర్పంచ్ వల్లభనేని వెంకటసుబ్బారావు చౌదరి, టీడీపీ నాయకులు పోలవరపు వెంకటరావు, వల్లభనేని కృష్ణప్రసాద్‌లు కౌతవరం సబ్‌స్టేషన్ అధికారులను ప్రశ్నించారు. అయితే అకాల వర్షాల కారణంగా కండెక్టర్లు కాలిపోవడం, చిగురుకోట వద్ద టవర్స్ కూలిపోవడం కారణంగా ఈ సమస్యలు తలెత్తుతున్నాయని వారు సమాధానమిచ్చారు. పామర్రు ఫీడర్ నుంచి ఇవ్వడం వల్ల లోడ్ ఎక్కువై ట్రిప్పవుతున్నాయని ఎలక్ట్రికల్ సిబ్బంది వివరణ ఇచ్చారు. స్థానికులు అక్కడి నుంచే ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు ఫోన్‌చేసి మాట్లాడి సమస్యచెప్పి విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడించారు. రెండ్రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని సిబ్బంది తెలిపారు.


విద్యుత్ సిబ్బందితో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● మార్కెట్ కమిటీ చైర్మన్ రవికుమార్

గుడ్లవల్లేరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : పశుసంవర్ధక శాఖ, రాష్ట్రప్రభుత్వం రైతులను పాడిపోషణకు ప్రోత్సహించేందుకు అనేక పథకాలను అమల్జేస్తోందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్ అన్నారు. సోమవారం గుడ్లవల్లేరు డివిజన్ పశుసంవర్ధకశాఖ కార్యాలయం వద్ద ప్రభుత్వం ద్వారా పశు సంవర్ధక శాఖ 50 శాతం రాయితీతో పాడి రైతులకు పశుదాణా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కాగా మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్ చేతుల మీదుగా పంపిణీ ప్రారంభించారు. మండలానికి 16.30 టన్నులు దాణా కేటాయించారని, రైతులు తమ 50 శాతం సొమ్మును ఆన్‌లైన్‌ద్వారా చెల్లించిన వారికి దాణా అందచేస్తామని పశుసంవర్ధకశాఖ ఎడి లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో సంతకమిటీ అధ్యక్షుడు వల్లభనేని వెంకటసుబ్బారావు చౌదరి, కార్యదర్శి ఉమామహేశ్వరరావు, వెంకటరావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు వల్లభనేని రంగబాబు పాల్గొన్నారు.


రైతులకు పశుదాణ పంపిణీ చేస్తున్న రవికుమార్

పుచ్చలపల్లి సేవలు నేటితరానికి ఆదర్శం

గుడివాడ, మే 19 (ఆంధ్రజ్యోతి) : సమజానికి పుచ్చలపల్లి సుందరయ్య అందించిన సేవలు నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని అని సీపీఎం నాయకులు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఐద్వా కార్యదర్శి పి.రజిని అధ్యక్షతన పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సభను నిర్వహించారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అంగలూరు డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం.వి.జి.ఆంజనేయులు, ఏఎన్‌ఆర్ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు గాంధీబాబు, సాహితీ స్రవంతి అధ్యక్షుడు లంకా సురేంద్ర, సీనియర్ జర్నలిస్ట్ బండారు రాధాకృష్ణ, నాయకులు వీరమ్మ, కొండ, పాల్గొన్నారు.

పామర్రు : పేదల అభ్యున్నతి కోసం జీవితాన్నే త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని డివిజన్ సీపీఎం కార్యదర్శి ఓడుగు గంగాధర్‌ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత సుందర్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ సీపీఎం నేత రాజా, విల్సన్, నాగభూషణం, కెలక్ష్మణ, డి.రఘునాథరావు, ఆదిశేషు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సర్పంచ్ మరణం టీడీపీకి తీరని లోటు

గుడివాడ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధిగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ మరణం, ప్రజలకే కాక టీడీపీకి తీరని లోటని రావి ఆవేదన వ్యక్తం చేశారు. దొండపాడు సర్పంచ్ చోరగుడి సురేఖ భౌతికకాయాన్ని ఏపిఎస్‌డబ్ల్యూసి చైర్మన్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావులు సోమవారం సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబసభ్యులకు భగవంతుడు మనోధైర్యం కల్పించాలని ఆకాంక్షించారు.

దొండపాడు గ్రామసర్పంచ్ సురేఖ మరణం టీడీపీకి తీరని లోటని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆయన హైదరాబాద్‌లో ఉండటంతో సర్పంచ్ కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ సురేఖ కుటుంబసభ్యులకు టీడీపీ అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం టీడీపీ నాయకులు చేకూరి జగన్మోహనరావు, గుడివాడ ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడివాడ జోన్స్, తాగునీటి సంఘం అధ్యక్షుడు నూతక్కి కుటుంబరావు, వీర బసవయ్య, దొండపాడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ మునునూరి రాజేంద్ర ప్రసాద్, భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. భారీ ర్యాలీతో అంతిమయాత్ర కొనసాగింది.

దొండపాడు గ్రామసర్పంచ్ సురేఖ విద్యుత్ షాక్‌తో మరణించినట్లు భర్త చోరగుడి బుజ్జిబాబు రూరల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై చంటిబాబు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


నివాళులర్పిస్తున్న రావి వెంకటేశ్వరరావు

మహానాడు రేపు

గుడివాడ, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21వతేదీ సాయంత్రం 5 గంటలకు మహానాడును నిర్వహిస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. ఈనెల 20వ తేదీన స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించతలపెట్టిన నియోజకవర్గ మహానాడును వాయిదా వేసినట్టు ఎమ్మెల్యే సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాతృమూర్తికి ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో చికిత్స నిమిత్తం ఆమెను ఆదివారం రాత్రి హుటాహుటీన హైదరాబాదుకు తరలించారు. ఈ క్రమంలో మహానాడు వాయిదా వేస్తునట్టు తెలిపారు.

గంజాయి కేసులో పాత నేరస్థుడి అరెస్ట్

గుడివాడ రూరల్: గంజాయి కేసులో పాత నేరస్థుడిని అరెస్టు చేసినట్టు ఎస్సై ఎన్.చంటిబాబు సోమవారం తెలిపారు. గత ఫిబ్రవరి 20వ తేదీన లింగవరంలో గంజాయి అమ్ముతూ పట్టుబడిన నలుగురిని గతంలో అరెస్టు చేశామన్నారు. తెలంగాణాకు చెందిన షేక్ జాన్ పాషా వీరికి గంజాయి సరఫరా చేస్తున్నట్టు తెలిసిందన్నారు. సోమవారం జాన్ పాషాను అరెస్టు చేసి కోర్టు పంపగా, ఇతనికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.


సూచనలిస్తున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

టిడ్కో గృహ సముదాయంలో కార్డెన్ సెర్చ్

గుడివాడ, మే 19 (ఆంధ్రజ్యోతి) :మల్లాయిపాలెం శివారు టిడ్కో భవన సముదాయంలో గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ నేతృత్వంలో సోమవారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన ధ్రువపత్రాలను లేని 27 ద్విచక్రవాహనాలు, ఒక కారు, ఒక ఆటోను సీజ్ చేశారు. గుడివాడ పట్టణ సీఐలు కొండపల్లి శ్రీనివాస్, చల్లా నాగప్రసాద్, తాలుకా సీఐ ఎస్.ఎల్.ఆర్ సోమేశ్వరరావుల ఆధ్వర్యంలో డివిజన్‌లోని ఎస్సైలు, కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ ధీరజ్ వినీల్ హెచ్చరించారు.

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జన్మదినోత్సవం

గుడ్లవల్లేరు : గుడివాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కేక్‌ను సోమవారం కట్ చేశారు. సత్యదేవుని ఆలయ ప్రధానఅర్చకులు రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు వెంకట్రావుకు వేదాశీర్వచనం పలికారు.గుడ్లవల్లేరు ఏఎంసి చైర్మన్ రవికుమార్, నరేష్, వెంకటరావు, వెంకటసుబ్బారావు చౌదరి పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలని వినతి

గుడ్లవల్లేరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని భాగ్యవిధాత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ తెలిపారు. తాగునీటి చెరువుకు ఫెన్సింగ్, చెరువుకు నీరు నింపే బోదిలో పంటమురుగు దిగనివ్వకుండా చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం ఆయన గ్రామస్తులతో కలిసి ఎంపీడీవో, తహసీల్దారులకు వినతిపత్రాలను అందజేశారు. గ్రామంలో తాగునీటి చెరువులో పశువులు దిగకుండా చెరువుకు కంచే ఏర్పాటు చేయాలని వారు కోరారు. అలానే పంచాయతీ వారు గతంలో తాగునీటి చెరువుకు నీరునింపే బోదె నుంచి కాకుండా కొత్తబోది ద్వారా చెరవకు నీరు నింపుతున్నారు. కొత్తబోది నుంచి నీరు పెట్టడం వల్ల ఈ బోదిలో పంట మురుగు దిగడంతో తాగునీరు కలుషితమవుతున్నాయని గ్రామస్థులు ఆరోపించారు. నంతరం గ్రామస్థులు ఎంపీడీవో టి.విజయసారథి, తహశీల్దారు లోకరాజులకు వినతీపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సింగలూరు గ్రామస్థులు ఉద్దంటి నాగమల్లేశ్వరరావు, మాచర్ల రమణయ్య, తుమ్మలచర్ల లక్ష్మణరావు, బిట్రా అర్జునరావు, ఆకురాతి జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న శ్యామ్‌కుమార్

కార్మికుడికి తీవ్ర గాయాలు

గుడివాడ, మే 19(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పనుల్లో సోమవారం కార్మికుడు తీవ్ర గాయాలపాలయ్యాడు.ఫ్లైఓవర్ పనుల్లో భాగంగా స్థానిక పామర్రు రోడ్డులోని పెద్దకాలువ వద్ద ఫ్లైఓవర్ పిల్లర మీద నుంచి ఒరిస్సాకు చెందిన కార్మికుడు గిరీష్ కిందపడ్డాడు. గాయాలపాలైన అతడిని వెంటనే స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గిరీష్‌కు కుడి కాలు తుంటి విరిగింది. గాయం తీవ్రంగా ఉండటంతో బాధితుడిని హుటాహుటీన ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పనుల్లో భాగంగా పిల్లర్ వద్ద కాంట్రాక్టర్ ఎటువంటి రక్షణ చర్యలు లేకుండా పనులు చేయిస్తుండటం వల్లే కార్మికుడు గాయాలపాలయ్యాడని స్థానికులు పేర్కొంటున్నారు.

గోపురాల పునఃనిర్మాణం కోసం విరాళాలు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో వేంచేసియున్న రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయ గోపురం, ఆంజనేయస్వామి మందిర గోపురాల పునఃనిర్మాణం కోసం భక్తులు విరాళాలను నిర్వాహక కమిటీకి సోమవారం అందజేశారు. గ్రామానికి చెందిన గుప్తదాత ఒక లక్ష రూపాయలు, అలానే అట్లూరి సత్యనారాయణ భాస్కరావు,వీరమ్మల జ్ఞాపకార్థం వారి సంతానం కుమారులు అట్లూరి వీరప్రభు చలపతి, శ్రీరామకృష్ణ దుర్గావరప్రసాద్, కుమార్తెలు కొండపల్లి వీరకుమారి, చాపరాల కస్తూరిలు రూ.1.08 లక్షలు విరాళాలను నిర్మాణ కమిటీ పెద్దలు వల్లభనేని వెంకట్రావుకు అందజేశారు.

ఘనంగా సామూహిక కుంకుమార్చన


కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

కూచిపూడి, మే 19 (ఆంధ్రజ్యోతి): పెదసనగల్లులోని లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మహిళలు సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. కల్యాణ దంపతుల సన్నిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమాలను వేదపండితులు దీవి ఉదయ్ కుమార్ అయ్యంగార్, అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో జరిగాయి. తిరు కళ్యాణోత్సవం అనంతరం కల్యాణ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడి మృతి


శిష్టా దత్తాత్రేయులు

గుడివాడ, మే 19 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ సీనియర్ నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ శిష్టా దత్తాత్రేయులు(69) గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం రాత్రి 9గంటల సమయంలో హైదరాబాద్‌లో గుండెపోటుకు గురై మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రజల సందర్శనార్థం శిష్టా భౌతికకాయాన్ని స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో ఉంచారు. పార్టీ సీనియర్ నాయకులు వడ్డాది రాజేష్ పార్టీ జెండా కప్పారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ధనేకుల మురళీమోహన్, వింతా సంజీవరెడ్డి, జిల్లా మహిళ అధ్యక్షురాలు ఝాన్సీ పట్టణ అధ్యక్షుడు శొంఠి దామోదరరావు, టీడీపీ నాయకులు దింట్యాల రాంబాబు, నెరుసు చింతయ్య, గుండిమెడ రాఘవేంద్రరావు, గోకరకొండ బలరాం, వైసీపీ నాయకులు మండలి హనుమంతరావు, ఎం.వి. నారాయణ రెడ్డి, కొల్లపర సాయిసుబ్రహ్మణ్యం, బంటుమిల్లి సూర్యనారాయణ, బి.సి నాయకులు కఠారి రామ్‌కుమార్ తదితరుల శిష్టా భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. శిష్టా ఆకస్మిక మృతి పట్ల కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

ప్రతి విద్యార్థీ గణితంపై పట్టు సాధించాలి

పామర్రు, మే19 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థీ గణితంపై పట్టు సాధించాలని గ్రంథాలయాధికారి ఎం.ఝాన్సీరాణి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన సదస్సులో గణితంపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణితంపై పట్టు సాధించే వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చెప్పారు. అనంతరం స్పోకెన్ ఇంగ్లీష్‌ను బోధించారు. ఇదే విధంగా జమీగొల్వేపల్లి గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో చిన్నారులకు యోగ, ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.ఎన్.సురేష్, గుమ్మడి ఉషాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు

పెదపారుపూడి : వేసవి శిక్షణా తరగతులలో భాగంగా పెదపారుపూడి శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు హ్యూమన్ లైబ్రరీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారిణి ఎంవి.ఎస్.లక్ష్మీ మాట్లాడుతూ విద్యావిషయక అవగాహన సామర్థ్యం పెంపొందించుకోవటానికి హ్యూమన్ లైబ్రరీ వంటి విధానపరమైన పద్ధతులు ఎంతగానో తోడ్పడాయన్నారు. యలమర్రు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులచే మ్యాథ్స్ పజిల్స్, టేబుల్స్ నేర్పించారు. అనంతరం విద్యార్థులచే క్యారమ్స్, మ్యూజికల్ చైర్స్ గేమ్ ఆడించినట్లు గ్రంథాలయం నిర్వాహకులు జె.విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు, పాల్గొన్నారు.


విద్యార్థులకు గణితంపై శిక్షణ ఇస్తున్న ఝాన్సీరాణి

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535



వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

బంటుమిల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి) : భారతీయులు ఐకమత్యంతో ఉండాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. బంటుమిల్లిలో హనుమాన్ శోభాయాత్ర సోమవారం వైభవంగా జరిగింది. శోభాయాత్రను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. పాశ్చాపురం సువర్చలా సమేత ఆంజనేయ స్వామి ఆలయం నుంచి మల్లంపూడి వరకు శోభాయాత్ర సాగింది. శివశక్తి ఆధ్యాత్మిక సంస్థ రాష్ట్ర సమన్వయ కర్త బడుగు భోగేశ్వరప్రసాద్ వక్తగా వ్యవహరించారు.



విశ్రాంత చీఫ్ సెక్రటరీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, కేంద్ర ప్రభుత్వ హౌసింగ్ బోర్డు డైరెక్టర్ రాధాకృష్ణలకు స్వామి ప్రసాదాలు అందజేస్తున్న ఈవో

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో ప్రముఖులు

మోపిదేవి, మే 19 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. విశ్రాంత చీఫ్ సెక్రటరీ ఎల్.వి.సుబ్రహ్మణ్యం, కేంద్ర ప్రభుత్వ హౌసింగ్ బోర్డు డైరెక్టర్ గూడూరు రాధాకృష్ణ కుటుంబ సమేతంగా వేర్వేరుగా దర్శించుకున్నారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో వారిని సత్కరించారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు, ఆలయ పర్యవేక్షకులు మధూసదనరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందించారు.

తూనికలు, కొలతలు జాగ్రత్తగా గమనించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా తూనికలు కొలతలు శాఖాధికారి నాగేశ్వరరావు

మచిలీపట్నం టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : తూనికలు, కొలతల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా తూనికలు కొలతలు శాఖాధికారి నాగేశ్వరరావు అన్నారు. ప్రపంచ తూనికలు కొలతల దినోత్సవం సందర్భంగా సోమవారం ఆర్టీసీ బస్టాండులో అవగాహన సదస్సు నిర్వహించారు. నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తూనికలు, కొలతల శాఖ ఆమోద ముద్ర వేసిన కాటాలనే వాడాలన్నారు. వస్తువులు కొన్న తరువాత వినియోగ దారులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ డిపో మేనేజరు పెద్దిరాజు మాట్లాడుతూ, వినియోగదారులు చైతన్యవంతులు కావాలన్నారు. ఆర్టీసీ అధికారులు, వినియోగదారులు పాల్గొన్నారు.



జిల్లా ఎంఈఎఫ్ నూతన కమిటీ

జిల్లా ఎంఈఎఫ్ అధ్యక్షుడిగా దేవరపల్లి విక్టర్‌బాబు

మచిలీపట్నం టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ అధ్యక్షుడిగా దేవరపల్లి విక్టర్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈశ్వర్ రెసిడెన్సీలో సోమవారం జరిగిన ఎన్నికల్లో విక్టర్ ప్రసాద్ అధ్యక్షునిగా, ఉపాధ్యక్షునిగా జుజ్జువరపు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బీడెల్లి మరియకుమార్, అడిషనల్ జాయింట్ సెక్రటరీగా బొనికాల కృష్ణ, కోశాధికారిగా రాచపూడి బాలస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉడుముల దుర్గారావు, గౌరవాధ్యక్షునిగా మేడర రమేష్, ముఖ్య సలహాదారుగా రావెల వరుణ్ కుమార్, లీగల్ అడ్వైజర్‌గా అద్దేపల్లి నిరంజన్ ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షాలు ఎన్నిక నిర్వహించారు. గంద్రపు సీనయ్య, దేవరపల్లి ఏసుబాబు, దేవరపల్లి రాబర్ట్ కె శాంతిబాబు తదితరులు పాల్గొన్నారు.



అన్నదాత సుఖీభవ నమోదుపై అవగాహన కల్పిస్తున్న గోపు సత్యనారాయణ

అన్నదాత సుఖీభవలో పేర్లు నమోదు చేసుకోవాలి

మచిలీపట్నం టౌన్ , మే 19 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకంలో రైతులందరూ నమోదు చేసుకోవాలని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ అన్నారు. బందరు మండలం కానూరు గ్రామంలో సోమవారం అన్నదాత సుఖీభవ కార్యక్రమంపై అవగాహన సదస్సు జరిగింది. గోపు సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రతి రైతు ఈకేవైసీని గ్రామ సచివాలయాల్లో అగ్రికల్చరల్ అసిస్టెంట్ వద్ద నమోదు చేసుకోవాలన్నారు.





మదర్‌హైనీ 111వ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, సమాధి వద్ద నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

మదర్ హైనీ సేవలు వెలకట్టలేనివి

మచిలీపట్నం టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : అనాథలకు మదర్ హైనీ చేసిన సేవలు వెలకట్టలేనివని మాజీ ఎంపీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు అన్నారు. మదర్ హైనీ 111వ జయంతిని పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో హైనీ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. హైనీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, మదర్ హైనీ అనాథాశ్రమం నెలకొల్పి వేలాది మందికి ఆశ్రయం కల్పించడంతో పాటు విద్యావంతులను చేశారన్నారు. వారిలో పలువురు ఉన్నత ఉద్యోగాల్లో పని చేస్తున్నారన్నారు. బెరాకా మినిస్ట్రీస్ అధినేత కిరణ్ పాల్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ తదితరులు మదర్ హైనీ సేవలను వివరించారు. మదర్ హైనీ సమాధికి పూర్వ విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అవనిగడ్డ ఉపసర్పంచ్‌గా మల్లేశ్వరి



అవనిగడ్డ, మే 19 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ పంచాయతీ ఉప సర్పంచ్‌గా 17వ వార్డు సభ్యురాలు మురుగు మల్లేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఎన్నికల్లో సర్పంచ్‌గా గొరుముచ్చు ఉమా విజయం సాధించగా, మొదటి రెండు సంవత్సరాలు గాజుల జైగోపాల్, తదనంతరం ఆర్యవైశ్య ప్రముఖులు కోడూరు సత్యనారాయణ ఉపసర్పంచ్‌గా కొనసాగారు. గత నెలలో కోడూరు సత్యనారాయణపై అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వగా, వ్యక్తిగత కారణాలతో ఆయన పదవికి రాజీనామా చేశారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సూచనల మేరకు సోమవారం మల్లేశ్వరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఘంటసాల ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన ఎన్నికల్లో సర్పంచ్ గొరుముచ్చు ఉమా, పంచాయతీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు, కార్యదర్శి నగ రాజకుమారి పాల్గొన్నారు.



మోపిదేవిలో జరిగిన మినీ మహానాడులో ఒంగోలు జాతి ఎద్దుల బండ లాగుడు పోటీలు



దుర్యోధన ఏకపాత్రాభినయం చేస్తున్న బోలెం రామారావు



కబడ్డీ విజేతలకు బహుమతులు అందిస్తున్న కొనకళ్ల నారాయణరావు

ఎన్టీఆర్ స్ఫూర్తిగా సంక్షేమ పథకాల అమలు

• మినీ మహానాడులో మంత్రి రవీంద్ర • ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు, పోటీలు

మోపిదేవి, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ స్ఫూర్తిగా సంక్షేమ పథకాలను సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మోపిదేవిలో సోమవారం నియోజకవర్గ స్థాయి మినీ మహానాడులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయనరావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహానాడులో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కబడ్డీ పోటీలను ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు ప్రారంభించగా, అవనిగడ్డ - తలగడదీవి ప్రాంతాలకు చెందిన రెండు జట్లు పోటాపోటీగా పాల్గొన్నాయి. ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన జట్లకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు. బండలాగుడు, పూటీ లాగుడు పోటీలను మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, కొనకళ్ల నారాయణరావు ప్రారంభించారు. పూటీ లాగుడు పోటీలను ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్ర ఎద్దుల బండ్లపైకి ఎక్కి పసుపు కండువా తలపాగాగా చుట్టి యువకులను ఉత్సాహ పరిచారు. చల్లపల్లికి చెందిన ప్రముఖ కళాకారుడు బోలెం రామారావు ప్రదర్శించిన దుర్యోధన ఏకపాత్రాభినయం కరతాళధ్వనులందుకుంది. ఘంటసాల చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆరు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు తాడు లాగుడు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, బొబ్బా గోవర్ధన్, కొల్లారి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధన రావు, యాసం చిట్టిబాబు, మోర్ల రాంబాబు, తుమ్మల చౌదరి బాబు, బండే శ్రీనివాసరావు, మెండు లక్ష్మణరావు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, ఎంపీపీ రావి దుర్గావాణి, సర్పంచ్‌లు పైడి పాముల కృష్ణకుమారి, దొప్పలపూడి గంగాభవాని, రావి నాగేశ్వరరావు, మెడబలిమి మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



పెడన నియోజకవర్గ మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, వేదికపై మంత్రి రవీంద్ర, కొనకళ్ల

టీడీపీ పాలనలోనే పెడన అభివృద్ధి : కాగిత

పెడన, మే 19 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ పాలనలోనే పెడన నియోజకవర్గం అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. తోటమూల టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన నియోజకవర స్థాయి మినీ మహానాడులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పింఛను రూ.4వేలు ఇస్తున్నామని, పేదల ఆకలితీర్చే అన్న క్యాంటీన్లను ప్రారం భించామని, ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేశామని ఆయన అన్నారు. చేనేత కార్మికులు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు సర్వే నిర్వహిస్తున్నామని, రోడ్లకు మరమ్మతులు చేసుకుంటూ వస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ముందుకు వెళుతున్నామన్నారు. ఈ ఏడాది జూన్‌లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ శ్రేణు లు కూటమి ప్రభుత్వంలో జరిగిన మంచిని ప్రజలకు వివరించడంతో పాటు వైసీపీ దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఏడాది కాలంలో పెడన నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ఆయన వివరించారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు మా ట్లాడుతూ, పెడన మునిసిపాలిటీలో వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన వృద్ధాప్య పింఛన్లు పునరుద్ధరించాలని, చేనేత కార్మికుల సంక్షేమం కోసం గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన 12 సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేయాలని, చేనేత సహకార సంఘాలకు నిధులు విడుదల చేయాలని కోరారు. ఉగ్రవాదులతో జరిగిన పోరులో అశువులు బాసిన అమర వీరుడు మురళీనాయక్, పెడన నియోజకవర్గంలో మృతిచెందిన దేశం నాయకులు, కార్యకర్తలకు సభ సంతాపం తెలిపింది. వారి మృతికి సంతాప సూచకంగా సభ రెండు నిమిషాల పాటు మౌనం పాటించింది. సీనియర్ టీడీపీ నాయకుడు శలపాటి ప్రసాద్ సారథ్యంలో కొనకళ్ల బుల్లయ్య, శలపాటి ప్రసాద్, యక్కల శ్యామలయ్య, కూనపరెడ్డి వీరబాబు, పోతన స్వామి, వడుగు తులసీరావు, అబ్దుల్ ఖయూం, గోపీ నాగబాబు, హమీదుల్లా, బొర్రా కాశీ పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న నేతలు

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం

ఘంటసాల, మే 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం గ్రామంలో శ్రీకాకుళం యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ముఖ్యఅతిథులుగా ఎంపీటీసీ సభ్యులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), పాప వినాశనం టీడీపీ నేత కుంపటి చిట్టిబాబు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు దాసం రామకృష్ణ, తెలుగురావుపాలెం మాజీ సర్పంచ్ ఆరుంబాక రవి, హాచియా, కొల్లిపర అర్జునరావు, పిన్నమనేని దినేష్, జీళ్ల శ్రీనివాస్‌లు తదితరులు పాల్గొని విజేతలకు నగదు బహుమతులు, షీల్డులు అందజేశారు. ప్రథమ బహుమతి గుత్తికొండ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు గుత్తికొండ కల్యాణ్ - రవిబాబు రూ.30 వేలు, ద్వితీయ బహుమతి శ్రీకాకుళం ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) రూ.20 వేలు, తృతీయ బహుమతి నునావత్తు వీరభద్రరావు, సురేష్ జ్ఞాపకార్థం నునావత్తు ఉషారాణి రూ.10 వేలు అందజేశారు. గ్రామస్థులు, క్రీడాకారులు, యువత తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శి శేషగిరిరావుకు వినతిపత్రం అందజేస్తున్న అంబటి బ్రాహ్మణయ్య కాలనీ వాసులు

కోతుల బెడద నుంచి కాపాడండి

కోడూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : కోతుల బారి నుంచి కాపాడాలని కోరుతూ అంబటి బ్రాహ్మణయ్య కాలనీ వాసులు సోమవారం కోడూరు గ్రామపంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావుకు వినతిపత్రం అందజేశారు. కోతుల బెడద అధికంగా ఉందని, ఇంటి వద్ద గృహోపకరణాలను ధ్వంసం చేస్తున్నాయని, దాడి చేసి గాయపరుస్తున్నాయని కాలనీ వాసులు వాపోయారు. వృద్ధులు, పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. ఇప్పటి వరకు 20 మంది కాలనీవాసులను కోతులు గాయపర్చాయన్నారు. పంచాయతీ అధికారులు తగు చర్యలు చేపట్టి కోతుల బెడద నుంచి కాలనీ వాసులకు రక్షణ కల్పించాలని కోరారు.



నేత్రపర్వంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

అవనిగడ్డ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం శ్రీ వారి కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. దేవాదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవం నిర్వహించగా, పది మంది దంపతులు పీటల కూర్చుని కళ్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు విఖనసా చార్యుల ఆధ్వర్యంలో స్వామివారి కళ్యాణం జరిపించగా, భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయ అర్చకులు అగ్నిహోత్రం ధన్వంతరాచార్య పర్యవేక్షించారు. మండలి భావన్నారాయణ, మండలి దినేష్ ఆధ్వర్యంలో దాదాపు 3 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

పేదలకు అన్నదానం

అవనిగడ్డ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత కంఠమనేని రవి శంకర్ జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం వికలాంగులు వృద్ధులకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. చిట్టా ప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులివ్వాలి

నాగాయలంక, మే 19 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించేందుకు చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు కోరారు. నాగాయలంక ఒకటో సచివాలయంలో టీడీపీ నాయకులు ఉప్పల ప్రసాద్, లకనం నాగాంజనేయులతో కలిసి దరఖాస్తులను సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ చంద్రశేఖర్‌రావు, సోషల్ వెల్ఫేర్ సోములుకు అందజేశారు. నిరక్షరాస్యులు ఎక్కువగా ఉన్నందున బాధ్యతతో వివరాలు స్వీకరించి, రేషన్ కార్డులు అర్హులైన వారందరికీ అందేలా కృషి చేయాలని కోరారు.

నాంచారమ్మ తల్లికి విశేష పూజలు

మోపిదేవి, మే 19 (ఆంధ్రజ్యోతి): పెదకళ్లేపల్లిలో పురాతన ఆలయమైన నాంచారమ్మ తల్లి పునఃప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. గణపతి పూజ, క్షీరాధివాసం నిర్వహించారు. భక్తులు, మహిళలు అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బ్యానర్ల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

మచిలీపట్నం టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో బోర్డులు, బ్యానర్లు ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు తెలిపారు. అనుమతి పొంది ఏర్పాటు చేసిన బ్యానర్లు, డిస్‌ప్లే బోర్డులను ఆ సందర్భం పూర్తయిన వెంటనే మూడు రోజుల్లోగా తొలగించాలన్నారు. తొలగించని పక్షంలో మునిసిపాలిటీనే తొలగిస్తుందని, వాటికయ్యే ఖర్చు జరిమానాతో సహా చెల్లించాల్సి వస్తుందన్నారు.

బహుజన విద్యార్థుల హక్కుల కోసం పోరాడాలి

మచిలీపట్నం టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : బహుజన విద్యార్థులు హక్కుల కోసం పోరాడి విద్యాలయాల్లో, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు సాధించాలని బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రేమానంద్ అన్నారు. సోమవారం జిల్లా కోర్టుసెంటర్‌లోని ప్రైవేట్ ఫంక్షన్ హాలులో జరిగిన జిల్లా బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ సమావేశంలో ప్రేమానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లా వ్యాప్తంగా బహుజన విద్యార్థి ఫెడరేషన్ విద్యార్థి నూతన కమిటీలను వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు డి. కార్తికేయ అధ్యక్షత వహించగా ఎస్. బాలాజీ, బొమ్మిడి విజయ్, కె. రామనాథ్ తదితరులు మాట్లాడారు.

రెండోరోజు అంకమ్మ జాతర

అవనిగడ్డ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డలో అంకమ్మ తల్లి జాతర సోమవారం రెండో రోజు కూడా ఘనంగా నిర్వహించా రు. పలువురు దంపతులు ఘటం బిందెలు నెత్తిమీద పెట్టుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. రిటైర్డ్ లస్కర్ రాయన సుబ్బారావుతోపాటు కుటుంబసభ్యులు మొక్కుబడులు తీర్చుకున్నారు.

100 మందికి నేత్ర పరీక్షలు

కోడూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : పిట్టలంక పంచాయతీ ఆఫీసు దగ్గర సోమవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. రేపల్లెలోని ఫోకస్ కంటి ఆసుపత్రి డాక్టర్ కిషోర్, డాక్టర్ దాస్ పర్యవేక్షణలో మేరుగ ప్రవీణ్ 100 మందికిపైగా రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసిన వారికి రేపల్లె ఫోకస్ ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తారన్నారు. గ్రామ సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావుతోపాటు వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు విజయ అమలేశ్వరి ఆలయం ముస్తాబు



పెడన రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : దావేజిపాలెం అంకెం వారి ఇలవేల్పు విజయ అమలేశ్వరీ దేవి ఆలయంలో 11 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఉత్సవాలను ఈనెల 22వ తేదీ నుంచి 11 రోజులపాటు నిర్వహించనున్నారు. అంకెం వారి వంశీయులు, ఆడపడుచులు దేశ విదేశాల నుంచి హాజరవుతారని కమిటీ సభ్యులు తెలిపారు.

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు

ఘంటసాల, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల, కొడాలి, శ్రీకాకుళం గ్రంథాలయాల్లో విద్యార్థులకు సోమవారం వ్యాసరచన, క్విజ్, ఆటల పోటీలు, కథలు చెప్పటం, చదివించటం, ఇంగ్లీష్ గ్రామర్ నేర్పించారు. గ్రంథాలయ అధికారులు దారా సుజాత, ఎం.సుబ్బారావు, ఎం.శరత్ కుమార్ పర్యవేక్షించారు.